



భక్తులు


జీవిత చరిత్ర

భక్త ఉద్ధవ









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **ద్వారకాదీష్ వాస్తు** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **ద్వారకాదీష్ వాస్తు** వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో **ద్వారకాదీష్ వాస్తు** వెబ్ సైట్ వారు అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు,కనుక వారిని సంప్రదించగలరు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:


http://dwarkadheeshvastu.com



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

॥ శ్రీహరిః ॥

భక్త ఉద్ధవ

శ్లో . న తథా మే ప్రియతమ ఆత్మయోనిర్న శంకరః ।
న చ సంకర్షణో న శ్రీర్నైవాత్మా చ యథా భవాన్ ॥
(శ్రీకృష్ణభగవానుడు)

ఉద్ధవా! శంకర, బ్రహ్మ, బలరామ, లక్ష్మి మరియు నా ఆత్మ వీటిలో యెవరూ కూడ నాకు నీకన్న ప్రియతములు కారు.

శ్రీకృష్ణ భగవానునియందు పరమ ప్రేమకలగడమే భక్తి, భక్తికి అవాంతరభేదాలు యెన్నోవున్నా సాధారణంగా భక్తికి వున్న భేదాలు రెండు. 1. సాధనభక్తి, 2. సాధ్యభక్తి. సాధన భక్తి ద్వారా అంతఃకరణము విశుద్ధమవుతుంది. తద్వారా ఆత్మతత్త్వ, భగవత్తత్వజ్ఞానం కలుగుతుంది. అనంతరం పరాభక్తి లేదా సాధ్యభక్తి లభిస్తుంది. పరాభక్తి రహితమైన జ్ఞానం పరమ జ్ఞానం కాదు. అది కేవలం సాధన జ్ఞానం, పరోక్షజ్ఞానం. పరాభక్తి, పరమజ్ఞానం అన్నవి ఏకమాత్రవస్తువులే. ఇందులో యీషణ్మాత్ర భేదంలేదు. పరమజ్ఞానం లేదా పరాభక్తి లభించడంలోనే జీవన సాఫల్యముంది. ఈ స్థితి కలుగనంతవరకు జీవుడు పరిభ్రమిస్తూనే వుంటాడు. ఈ స్థాయి ఎలా లభిస్తుంది? అన్నప్రశ్నకు ఉద్ధవుని జీవనమే సమాధానము. అతని జీవితంలో క్రమంగా సాధనభక్తి, సాధనజ్ఞానం పరాభక్తి పరమజ్ఞానోదయమయినది. అతడు భగవంతుని ప్రియ భక్తుడు. భగవత్తత్వజ్ఞాత. అంతేకాదు. శ్రీకృష్ణపరమాత్మకు సహచరుడై అతని స్వరూపమే అయివున్నాడు.

మధురలోని యదువంశములో వసుదేవుని బంధువు వరుసకు సోదరుడు అయిన దేవభాగుడు విశేషఖ్యాతి పొందినవాడు. భగవద్భక్తుడు, దేవబ్రాహ్మణ ఉపాసకుడయిన అతనికే సాధుసజ్జనుల యందు శ్రద్ధ

విశేషంగా వుండేది. అతని ధర్మపత్ని కూడ భర్తను అనుకూలంగా సంచరిస్తూ సతీసాధ్విగా ఖ్యాతిగాంచినది. శ్రీకృష్ణభగవానుడు మధురలో అవతరించిన కాలంలో ఈదంపతులకు ఉద్ధవుడు జన్మించాడు. ఉద్ధవుడు పరమాత్మయొక్క నిత్య సహచరుడు. వాసుదేవునితో బాటే అతడూ మధురకు విజయం చేసి శ్రీకృష్ణభగవానుని సేవించుకుంటూ వుండేవాడు. అతని మనస్సులో మరోకోరిక ఉండేది కాదు. యంత్రములవలె అతడు భగవదిచ్ఛను పాలించేవాడు.

బాల్యమునుండియే ఉద్ధవుడు భగవంతునికి పరమభక్తుడై వ్యవహరించేవాడు. ఆటలలో కూడ భగవత్సంబంధమైన ఆటలే ఆడేవాడు. ఓ. చెట్టుక్రింద కూర్చుని మట్టితో భగవద్విగ్రహాన్ని తయారుచేసేవాడు. యమునలో స్నానం చేసివచ్చేవాడు. లతలనుండి అందమైన పూలుకోసి తెచ్చేవాడు. ఫలాలను భగవంతునికి నివేదనచేసి భగవధ్యానంలో నిమగ్నమయ్యేవాడు. ఆదశలో అతనికి శరీరస్మృతియే ఉండేదికాదు. ఒకప్పుడు భగవన్నామములను కీర్తించేవాడు. మరొకప్పుడు ఆ దేవదేవుని గుణగానం చేసేవాడు. ఇంకొకవేళ భగవల్లీలల్లో తన్మయుడై పోయేవాడు. పగలల్లా గడచిపోయినా అతనికి ఆకలి విషయం జ్ఞప్తికి వచ్చేదికాదు.

"బాబూ! ఉద్ధవా! ఆలస్యమైపోతున్నది. రారా అన్నం చల్లారిపోతున్నది. నామాట వింటావా? వినవా? రానాయనా!" అని పిలిచేది తల్లి. ఆ మాటలేవీ అతనికి వినిపించేవికావు. భగవధ్యానంలో అతడు లగ్నమై ఉండేవాడు. ఒకవేళ ఏనాడైనా తల్లి పిలుపువిన్నా తన చిలుకపలుకులతో అమ్మా! ఇంకా నాపూజ కాలేదే. నాదేవుడు యింకా తినలేదే నేనెలారానే? ఎలా తిందునే. *ఐదు సంవత్సరాల వయస్సుగల ఉద్ధవకుమారుని శ్రద్ధాభక్తులకు తల్లి చకితురాలైపోయేది. పూజఅయిన

---

* యః పంచహాయనో మాత్రా ప్రాతరాశాయ యాచితః।
తన్నైచ్ఛద్రచయన్ యస్య సపర్యాం బాలలీలయా ॥

తరువాత ఆమె కుమారుని వాత్సల్యంతో ఒడిలోకి తీసుకొని అన్నం తినిపించేది.

కాలం గిరగిర తిరుగ సాగింది. ఉద్ధవునికి ఎనిమిది సంవత్సరాలు వచ్చాయి. యజ్ఞోపవీత సంస్కారమయింది. విద్యాధ్యయనార్థం గురుకులానికి వెళ్లాడు. సామాన్య గురుకులానికి కాదు. దేవతల గురుకులానికి దేవపురోహితుడైన ఆచార్య బృహస్పతులవారి దగ్గరకు చేరుకున్నాడు. సంపూర్ణ విద్యారహస్యాలను తెలుసుకోవడానికి అతనికి విశేషసమయం పట్టలేదు. భగవంతుని ప్రేమయే సర్వ విద్యారహస్యమైనది. అది అతనికి లభించి వుంది కదా? దానిని గురించి తెలుసుకోవడానికి అతనికి ఆలస్యం ఎందుకు అవుతుంది? శుద్ధమైన బుద్ధికలవాడు. జప, తప, భజనల ద్వారా మస్తిష్కాన్ని నిర్మలంగా చేసుకొన్నవానికి సర్వవిషయాలు శీఘ్రంగా జ్ఞాతమవుతాయి. సంధ్యా వందనం చేయని విద్యార్థికన్న సంధ్యావందనం చేసే విద్యార్థి విశేషజ్ఞానం కలిగి వ్యవహరించడం మనం చూస్తుంటాము కదా! సూర్య భగవానుడు వాని బుద్ధిని శుద్ధమొనరిస్తుంటాడు. ఉద్ధవునికి భగవద్భక్తివుంది. సాధనవుంది. దేవగురువు దగ్గర జ్ఞానాన్ని పొంది అతడు ఆచార్యుని ఆదేశానుసారం మధురానగరానికి మరలివచ్చాడు.

ఉద్ధవునికి మధురానగరములో విశేష గౌరవముంది. నగరంలోని వారందరూ అతని నీతి, జ్ఞాన, మంత్రణాశక్తులకు ముగ్ధులయ్యేవారు. యాదవులలో కార్యాచరణ విషయంలో మతభేదమొచ్చినా, ఏదైనా సమస్య ఎదురైనా వారు ఉద్ధవుని దగ్గరకు వచ్చి సలహా పొందేవారు. అంత ఉద్ధవుడు అత్యంత కౌశలంతో మతభేదాలను రూపుమాపి, సమస్యలను పరిష్కరించేవాడు. అతని బుద్ధికౌశలానికీ శాస్త్రజ్ఞానానికీ సర్వులూ ఆనందించి ప్రశంసించే వారు. సర్వులూ అతణ్ణి విశ్వసించేవారు. అతడందరినీ సేవిస్తూ సర్వులకూ హితాన్ని చేకూరుస్తు, కంసుని దుర్మార్గాలనుండి అందరినీ సంరక్షిస్తు భగవద్భజనలో నిమగ్నుడయ్యేవాడు.

శ్రీకృష్ణ భగవానుడు బృందావనం నుండి మధురానగరానికి

ఏచ్చేశాడు. కంసుడు ఉద్ధరింప బడ్డాడు. సంస్కార సంపన్నుడై శ్యామసుందరుడు ఉజ్జయినీ గురుకులానికి అధ్యయనార్థం వెళ్ళాడు. అనంతరం అక్కడనుండి మరలివచ్చి శ్యామసుందరుడు మధురలో నివసించసాగినప్పటి నుండీ ఉద్ధవుడు అతనితోనే ఉండేవాడు. అతడు కృష్ణునితోటే నిద్రించేవాడు, భుజించేవాడు. సంచరించేవాడు, క్రీడించేవాడు. మనోరంజనాదులలో పాల్గొనేవాడు. అతడు తన హృదయాన్నివిప్పి శ్రీకృష్ణునికి నివేదించుకునేవాడు. అతడు శ్రీకృష్ణుని అంతరంగ సఖుడయ్యాడు. భగవద్దర్శనంలో, భగవత్సాన్నిధిలో భగవంతుని తీవ్రమగు ఆలాపంలో, ఆజ్ఞాపాలనలో కలిగే ఆనందపారవశ్యంలో అతడు జగత్తునే మరచి పోయేవాడు. శ్రీకృష్ణునితో అతనికిగల సంబంధం సఖ్యసంబంధమే. ఉద్ధవుడు శ్రీకృష్ణుని ఏకాంతప్రేమికుడు.

భగవంతుడు ఎప్పుడు ఏఉద్దేశంతో ఏలీలను ప్రకటిస్తాడో ఎవరికీ తెలియదు. ఆయా విషయాలను స్వయంగా భగవంతుడూ, అతని కృపాపాత్రులైన మహాత్ములు మాత్రం తెలుసుకుంటారు. మనవంటి సామాన్యులు ఆలీలలో కేవలము బాహ్యరూపాన్ని మాత్రమే గుర్తించగలుగుతాము. స్వబుద్ధ్యానుసారం తదర్థాన్ని నిర్ణయించుకుంటాము. శ్యామసుందరుడు ఒరోజున అలాంటి ఓలీలను ప్రకటించాడు. గోపికల ప్రేమచే ఆకర్షింపబడియే ప్రకటించాడో కరుణావశుడై ప్రకటించాడో? ఉద్ధవుని హితార్థమే ఆలీలను ప్రకటించాడో? గోపికల ప్రేమను వెలుగులోనికి తీసుకువచ్చి తద్ద్వారా విశ్వకళ్యాణార్థమే ఆలీలను ప్రకటించాడో తెలియదు. అన్నీ సరిగ్గా వున్నాయి. భగవల్లీలలో భక్తుల అభిలాష, భగవంతుని అవ్యాజకరుణ, ఏభక్తుని యొక్కయో హితము, జగత్కళ్యాణము సర్వం అంతర్నిహితమై ఉంటాయని పరమాత్మ లీలను ప్రకటించాడు.

లీలా సూత్రధారి అయిన శ్రీకృష్ణుడు తనకు పరమప్రియుడైన ఉద్ధవుని ఏకాంతంలోకి తీసుకువెళ్లి అతనిచేతిని తనచేతిలోకి తీసుకుని అతిప్రేమతో పలికాడు. తత్సమయంలో శ్యామసుందరుని ముఖసీమపై కరుణ సంచరించసాగింది. అతని నయనాలు ప్రేమసంభరితాలైనాయి.

"ప్రియసఖా! ఉద్ధవా! నువ్వు నాపని ఒకటి చేసి పెట్టాలి. ఈపని నీవు మాత్రమే చేయయోగ్యమైనది. నీవు బృందావనానికి వెళ్ళి అక్కడ నా తల్లితండ్రులున్నారు. నేను వారి ఒడిలో ఆడేవాణ్ణి. వారు అత్యంత వాత్సల్యంతో గారాబంగా తమ చేతులతో అన్నం తినిపించేవారు. కంటికి రెప్పలా వారు నన్ను కాపాడుకుంటూండంతోనే వారి కాలమంతా గడచిపోయేది. నాకు వారు చద్దిఅన్నం పెట్టడంలో ఆలస్యమయితే గిలగిలలాడిపోయేవారు. పట్టుదలతో నేను గోవులను మేపుటకై వనాలకుపోగా మరలినేను యింటికి వచ్చేవరకూ వారి దృష్టినావైపే కేంద్రీకృతమై వుండేది. నేను లేని వారిజీవనం భారంగా ఉంటుంది. వెన్నను చూసినా, పటిక బెల్లాన్ని చూసినా వారికి నేను గుర్తువచ్చేస్తాను. మురళిని చూస్తే వారు స్మృతితప్పి పడిపోతారు. నాకు అత్యంత ప్రేమపాత్రమైన గోవులు నాకోసం యిటూ అటూ తిరుగులాడుతుంటే చూసే వారి హృదయాలు ద్రవించి పోతాయి. కాబట్టి ఉద్ధవా! వారిని ఓదార్చగల వారెవరు? నా మనసులోని భావాలన్నింటినీ యెరిగిన సఖుడా! వారిని ప్రసన్నులను చేయగల అర్హతనీకే ఉంది.

నా గోపికలున్నారు. నీళ్ళులేక విలవిలలాడే చేపలవలె నావియోగ దుఃఖంలో వారు చెందే వేదన వర్ణనాతీతమయింది. వారి విషయమై ఏకాంతంలో నీతోకూడ ఎన్నోసార్లు చర్చించి వున్నాను కదా! వారు తమ సర్వస్వాన్నీ నాకు అర్పించి వేశారు. నా ఆనందం కోసం వారు తమ జీవనాలను నిలుపుకున్నారు. వారు ఆత్మలను హృదయాలను కూడ నాకు దత్తం చేశారు. వారు నాగురించియే యోచిస్తూ, మనసా వాచా నన్నే సేవిస్తున్నామన్న భావంతో తమ కాలాన్ని గడుపుకుంటున్నారు. వారు తమ ప్రాణాలను నాప్రాణాలతో కలిపివేసుకున్నారు. నాకు యిష్టంలేని కార్యాలన్నింటినీ వారు త్యజించి వేశారు. అంతటితో వారు ఊరుకున్నారా? త్యజించరాని స్వజనులనేకాదు దుస్సాధ్యమైన ఆర్యపథాన్ని కూడ త్యాగం చేశారు. నన్నే తమ ప్రియతమునిగా భావించే వారి ఆత్మలు, నా వియోగంలో గిలగిలలాడిపోతుంటాయి. విరహంతో ఉత్కంఠతో వారు విహ్వలులైపోతుంటారు. లతాకుంజాదులను వనమార్గాలనూ తిలకించే వారికి నారహస్యక్రీడలు ధ్యానంలోకి వచ్చివుంటాయి. ఎంతని చెప్పేదను

ఉద్ధవా! వ్రజభూమిలోని ప్రతివస్తువు, ప్రతిఅణువూ, ప్రతిపరమాణువూ వారికి నాస్మృతిని కలుగజేస్తూ తీవ్రవేదనను కలుగజేస్తుంటాయి. ఉద్ధవా! నువ్వు నిశ్చయంగా విశ్వసించు. కనులెత్తివారు వాటివైపు చూడడం లేదు. ఈపాటికే వారుప్రాణాలను విడిచిపెట్టేవుంటారు. మరల వారికి వ్రజభూమికి పోవాలనిపించదు. వారు నాగోపికలు వారి ఆత్మ నాఆత్మ. అతి కష్టం మీద వారు జీవిస్తుంటారు. శీఘ్రంగా వెళ్ళి నువ్వు వారి విరహవ్యాధిని కొంచమైనా తగ్గించప్రయత్నించు.

ఇక ఆ నా సఖులు, నా సహచరులు గొప్ప పేద భావం లేకుండ నేను వారందరితో కలసిమెలసి తిరిగి ఆడి పాడాను. ఏకమై అహోరాత్రులు భేదరహితంగా వ్యవహరించాము. ఇప్పుడు కూడ ఆ గోపబాలురు ఆవులను మేపుటకై అడవులకు వెడుతూ వుంటారు. పగలల్లా రెప్పవేయకుండ మధురవైపు చూస్తుంటారు. ఉద్ధవా! వారు నా ప్రాణసఖులు, సహచరులు, నా లీలలకు సహకారులు. వారితో కలసిమెలసి నేను భుజించేవాణ్ణి. వారు తమ తమ ఇళ్ళనుండి మంచి మంచి తినుబండారాలను తెచ్చి ముందు నాకు తినిపించేవారు. ఆవులు దూరంగా మేయడానికి వెడితే వారు నన్ను వెళ్ళనిచ్చేవారు కాదు స్వయంగా వారే వెళ్ళి తోలుకువచ్చేవారు. వారి మీదకు యీషణ్మాత్రం ఆపదవచ్చినా నన్నే పిలిచేవారు. ఆర్తభావంతో, సత్యమైన హృదయంతో ఎలుగెత్తిపిలిచేవారు. ఓ పర్యాయం బ్రహ్మదేవుడు వారినందరినీ తీసుకుపోయాడు. సంవత్సర కాలపర్యంతం నేను వారందరిరూపాలనూ ధరించాను. బ్రహ్మదేవుడు పరాజితుడై పోయాడు. ఇంద్రుడు వారికి అనిష్టం చేయగోరగా సప్తాహకాలం నేను గోవర్ధనగిరిని నాచిటికెనవ్రేలిపై నిలిపాను. వారితో ఎగిరేవాణ్ణి, దూకేవాణ్ణి, గంతులేసే వాణ్ణి, ఆడేవాణ్ణి, ఉండివుండీ నాకు వారు స్మృతిలోకి వస్తుంటారు. వెళ్ళు. కేవలము నీవు మాత్రమే వారికి నచ్చచెప్పగలుగుతావు.

ఇక మా ఆవుల విషయం. అవి ముందు పోతూ వెన్నంటివచ్చే నన్ను చూడాలని తలలు వెనుకకు త్రిప్పినన్ను చూసేవి. మురళిపై నాదం చేస్తూ వాటి పేర్లు పెట్టి నేను పిలువగానే అవి ఎంతదూరంలో వున్నా

పరుగులెత్తి శీఘ్రంగా నాదగ్గరకు వచ్చేవి. నేను వాటిని లాలనగా నిమిరేసరికి అవిప్రేమగా నావైపుచూసేవి. అసంకల్పితంగానే వాటిపొదుగులనుండి క్షీరాలు స్రవించేవి. నేను మురళీగానం చేస్తుండగా విని అవి నాచుట్టూ చేరి చెవులు నిక్కబెట్టి వినేవి. తత్సమయంలో వాటి నోట వున్న గ్రాసాన్ని నమలడం, నెమరు వేయడం కూడ మరచిపోయేవి. కాళీయమడుగులో నేను దూకిననాడు అవన్నీ నా వెనుకనే ఆకుండంలో దూకసాగాయి. అతికష్టం మీద గోపాలురు వాటిని వారించారు. నేను ఆ కుండం నుండి బయటకు వచ్చేవరకూ అవి తీరాన నిలచి అంబారావాలుచేస్తూ విలపిస్తూ కన్నీరు కారుస్తు వుండిపోయాయి. ఇప్పుడు నేను కనపడక అవి ఎంతగా వేదన చెందుతు, దుఃఖిస్తుంటాయో వర్ణించలేను. ఉద్ధవా! నిన్ను చూడగానే అవి కొంత ఓదార్పును పొందుతాయి. నావంటి నీఆకృతినీ, నేను ధరించునట్టివే అయిన నీ వస్త్రాలనూ చూసి అవి నిన్ను ప్రేమగా చూస్తాయి. వాటిని నువ్వు నిమరగానే అవి తప్పక శాంతిని పొందుతాయి.

ఉద్ధవా! వ్రజభూమిలోని ప్రత్యేక స్థానం, అక్కడి ప్రతీ వృక్షమూ ప్రతీ లతా నా స్మరణకు వస్తున్నాయి. వాటిని నేను మరువజాలకున్నాను. అక్కడి సారస, హంస, చక్రవాక, మయూర కోకిలాదులన్నీ నా స్మరణకు వస్తున్నాయి. అక్కడి హరిణాదులు నాకు అతి దగ్గరగా వచ్చి, నా శరీరాన్ని తాకుతూ ఆనందించేవి. ఇప్పుడు కూడ నాకు ఆ అనుభూతులు కలుగుతున్నాయి. అక్కడి భ్రమరసముదాయంచేసే నాదాలు యిప్పుడు కూడ నాశ్రవణేంద్రియాలలో ప్రతిధ్వనిస్తున్నట్లు ఉంది. అక్కడి పక్షుల కిలకిలారావాలు నామనస్సును మోహింపజేస్తున్నాయి. ఉద్ధవా! నువ్వు వెళ్ళు. క్షణమాత్రవిలంబంకూడ చెయ్యకు.

నేను వ్రజపురిచేరి గోపికలప్రేమను తిలకిస్తాను. లేదా వారు జ్ఞానసాగరంలో నిమగ్నమైపోయారేమో తెలుసుకుంటాను. అనుకుంటూ ఉద్ధవుడు భగవత్ప్రేమ రసాస్వాదనార్థం భగవంతుని ఆజ్ఞానుసారం భగవత్సందేశంతో శీఘ్రంగా వ్రజపురివైపు రథారూఢుడై పురోగమించాడు. సంధ్య సమీపంలో వుండగా అతడు వ్రజపురి పరిహద్దుల్లోకి చేరుకున్నాడు.

అక్కడి హరితవనపంక్తులు సూర్యుని అరుణారుణకిరణానురంజితాలై ఉద్ధవునికి వ్రజభూమిస్వాగతం పలుకుతున్నదా! అన్నట్లు, పచ్చటి వేలాదిపతాకాలను ఎగురవేస్తున్నదా అన్నట్లుంది. ఉద్ధవుని రథం బృందావనంవైపు పురోగమిస్తున్నది. అతడు వ్రజపురిలో ప్రవేశించే సమయానికి వనాలనుండి గోవులు మరలివస్తున్నాయి. వాటిగిట్టల తాకిడికి దుమ్ము రేగసాగింది. అందువల్ల దారి కనపడక ఉద్ధవుని రథం ఆగిపోయింది. ఎదపోయిన గోవులకై ఆవులు రంకెలువేస్తు పరస్పరం అచ్చటిప్రాంతాన్ని కంపింప జేస్తున్నాయి. అంతకు ముందు కొన్నాళ్ళక్రితమే ప్రసవించిన గోవులు పొదుగులభారంతో అడుగులు వెయ్యలేక పోయినా లేగదూడలపైగల వాత్సల్యంతో పరుగులు తీస్తుండే ఆ దృశ్యం కన్నులపండువుగా ఉంది. పాలుతీసే వేళలో, వచ్చే "జాయ్ జాయ్" నాదాలు వేణురవాలవలె వ్రజభూమిని శోభింపజేస్తున్నాయి.

గోపికలూ, గోపబాలురూ చక్కగా అలంకరించుకుని బలరామకృష్ణుల కీర్తిని గానం చేస్తుంటే వ్రజసీమ పులకరించిపోతున్నది. వారి గృహాలలో అగ్ని, సూర్య అతిథి, గో, విప్ర, పూజలు విశేషంగా జరిగాయి. దశదిశలా అగరుధూపాలు సుగంధాన్ని వెదజల్లుతూ వుంటే జ్యోతులు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. గృహాలన్నీ సుగంధ మాలాలంకృతాలై వున్నాయి. నాలుగు దిక్కులలోనూ ఉన్న పూలతోటలలోని పువ్వులు గాలికి కదలాడుతున్నాయి. పక్షులు కిలకిలారావాలు చేస్తూవున్నాయి. భ్రమరసమూహాల ఝుంకారనాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి. జలస్థల భేదరహితముగా అక్కడ సర్వేసర్వత్రా పద్మాలే కనిపిస్తున్నాయి. హంసలు పక్షులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. దూరంనుండి రేగినవ్రజధూళి ఉద్ధవుని మీదపడి వ్రజభూమి తన ధూళితో ఆదిలో యెవరినో స్నానం చేయించి తనపురంలోకి రావడానికి అధికారినిచేస్తూన్నదా? అన్నట్లుంది. రథం కనపడడంతో ఆనగరవాసి ఒకడు "అటుచూడు ఏదో రథం వస్తూన్నట్లుంది. శ్రీకృష్ణుడే అయివుంటాడు. పీతాంబరం, వనమాల కుండలాలూ కనిపిస్తున్నాయి. శరీరం కూడా శ్యామ వర్ణంతోనే ఉంది. అదే రథం, అవే అశ్వాలు, కానీ శ్రీకృష్ణుడు ఒంటరిగా ఎందుకున్నాడు?" సోదరుడు బలరాముడు అక్కడే వుండి

పోయాడుకాబోలు. అందులకే కన్నయ్య ఒక్కడే వచ్చి ఉంటాడు. గోపబాలకులందరికందరూ ఉద్ధవుని రథంవైపు పరుగుతీశారు. తత్సమయంలో వారిమనస్సులో ప్రభవించిన ఉల్లాసం వర్ణనాతీతము.

గొల్లపిల్లలు దగ్గరగా వెళ్ళి గుర్తించారు. ఇతడు శ్రీకృష్ణుడు కాదు. అతడు మన దగ్గరకు వచ్చేటంతటి భాగ్యశాలురమా మనము. మరి కృష్ణసదృశవస్త్రాభరణాలను ధరించిన యీతడెవరు? వారిలా యోచిస్తుండగా ఉద్ధవుడు రథం దిగి క్రిందకు వచ్చాడు. మనసా వారికి ప్రణమిల్లి వారిని కౌగలించుకున్నాడు. మిత్రులారా! "కృష్ణసఖుడనైన నేను అతని రహస్య సందేశంతో ఇక్కడకు వచ్చాను. అతడు అత్యంత ప్రేమతో మిమ్మల్ని స్మరించి నన్ను ఇక్కడకు పంపినాడు. భయపడకండి. ఏదో ఓ రోజు శ్రీకృష్ణుడు యిక్కడకు వస్తాడు. మిమ్మల్ని విడచి అతడుండగలడా?"

శ్రీధాముడు కృష్ణుడింత మోహరహితుడై పోయాడా? అలాకాదే! అతని హృదయం అతికోమలమయింది. అతడు ఆవులను మేతకుతీసుకువెళ్ళి మరలి వచ్చిన తరువాత రాత్రి మేమంతా మాయిళ్ళకు వెళ్ళి నిద్రపోతాము, అప్పుడు రాత్రివేళ కూడ అతడు మా కోసం విలవిలలాడేవాడు. స్వప్నంలో కూడ అతడు మా పేర్లను పెట్టిపిలిచేవాడు. తూర్పు తెల్లవారుటే తడవుగా అతడు మా దగ్గరకు రావడానికి ఆత్రుతపడేవాడు. యశోదామాత సావధానురాలుకాకపోతే అతడు మా దగ్గరకు ఆహారం తీసుకోకుండానే పరుగెత్తుకు వచ్చేవాడు. పగలల్లా మాతో ఆడేవాడు, తినేవాడు. మాకు ఎంతమాత్రం కష్టం కలిగించేవాడు కాదు. మా శ్రీకృష్ణుడు, మా కన్నయ్య మధురకు వెళ్ళి మహానిష్ఠురుడై పోయాడని మేమెలా అనుకుంటాము. ఎలా నమ్ముతాము?

"ఉద్ధవా! అతడు యేదో ఒకనాడు తప్పక మా దగ్గరకు వస్తాడని నువ్వంటున్నావు. కానీ అతడు లేని క్షణం మాకు యుగంగా, ఓ ఘడియ మన్వంతరంగా, ఓ ఝాము కల్పసమంగానూ ఉంది, అతణ్ణి క్షణకాలం కూడ మేము మరువజాలము. అతడితో మేము క్రీడించే వేళలో మాకు రోజులు కనురెప్పపాటు కాలంలో గడచిపోయేవి. అతడు లేని మా

జీవనాలు మహాభారమైపోయాయి. ప్రపంచమంతా మాకు శూన్యంగా గోచరమవుతున్నది. అవే వనాలు, అవే వృక్షలతలు వాటి శీతల ఛాయలలో చిగురుటాకుల శయ్యపై శ్రీకృష్ణుడుపవ్వళించగా మేము పత్రములతో విసరి అతని స్వేదాన్ని దూరంచేసే వారము. అతని చరణకమలాలను మేము మా ఒడిలోనికి తీసుకొని హృదయానికి హత్తుకునే వారము. అతని హస్తాలను మాహస్తాలలోనికి తీసుకుని దివ్యసుఖాన్ని పొందేవారము. అతనితో మేము గంటలకొలదీ జలక్రీడలు సాగించే యమునానది అదియే. మేము ఆడుకునే వ్రజభూమి అదియే. అవన్నీ వుంటే మాత్రం యేమిలాభము? కృష్ణుడు లేని నదీ, వనాలు మాకు దుఃఖాన్ని కలుగజేస్తున్నాయి.

వాటివైపు మేమెప్పుడు కనులెత్తి చూడలేకపోతున్నాము. ఉద్ధవా! నిజంచెబుతున్నాము. గోవులు తలలెత్తి మధురవైపు చూస్తూ అంబారావాలు చేస్తున్నవేళలో మావేదన మరింతగా పెరిగి పోతూవుంటుంది. ఇక యీ ఆవు దూడల విషయం చూడు. దూరం నుండి ఎవరైనా వస్తుంటే కృష్ణుడే వస్తున్నాడన్న భావంతో పాలుత్రాగడం మానివేసి అటే చూస్తుంటాయి. మా హృదయాలు నిలవడంలేదు. వివశమైపోతున్నాము. నందనందనుడు వస్తాడన్న ఆశయే లేకపోతే మేము ప్రాణాలతో వుండేవారమేకాదు."

ఆ గొల్లపిల్లల ప్రేమను తిలకించి ఉద్ధవుడు ముగ్ధుడైపోయాడు. వారితో భాషిస్తూ వ్రజదశను* తిలకిస్తూనే ఉద్ధవుడు నందసదనం దగ్గరకు

---

* కుంజనమే భోరపుంజ గుంజరత శ్యామ
బోలత బిహంగ త్యోం కురంగ శ్యామ నామ హై
ధేను త్రున ముఖ ధరీ శ్యామ ఈ పుకారతీ హై
జమునా తరంగ సోర శ్యామ సబజామ హై
బైరతమే బాగతమే సోలతమే జాగతమే
శ్యామరట లగాత న రాగత బిరామహై
కృష్ణ చంద్ర బిరహా మవాసీ బ్రజవాసీ సబై
'రఘురాజ' హేరి రహా శ్యామ శ్యామ శ్యామ హై

వచ్చాడు. నందుణ్ణి సందర్శిస్తూనే అతడు ఆ పుణ్యశాలికి ప్రణమిల్లాడు. నందుడు ఉద్ధవుణ్ణి లేవదీసి హృదయానికి హత్తుకున్నాడు. అత్యానందంతో ప్రసన్నంగా ప్రేమతో కృష్ణుణ్ణి సత్కరించిన రీతిని సత్కరించాడు. నిత్యకృత్యభోజన భాజనాదులన్నీ అయిన తరువాత ప్రసన్నుడై సుఖాసీనుడైన పిమ్మట నందుడు ఉద్ధవునికి దగ్గరగా కూర్చుని అతిప్రేమతో మధుర గురించిన కుశలప్రశ్నలు వేయసాగాడు. "ఉద్ధవా! మాప్రియబంధువులైన వసుదేవుడు కుశలమే కదా! అతని పుత్రమిత్రసోదర బాంధవాదులందరూ ప్రసన్నులే కదా! చిరకాలం దుఃఖాలు అనుభవించిన తరువాత అతనికి భగవద్విశేషానుగ్రహం వల్ల సుఖాలనుభవించే అవకాశం లభించింది. పాపకర్మల ఫలితంగా దుర్మార్గుడైన కంసుడు అనుచరసహచర వర్గ సహితంగా అంతమై పోయాడు. ధార్మికులైన యదువంశీయులను అతడు విశేషంగా ద్వేషించేవాడు. ఇప్పుడు అందరూ స్వేచ్ఛగా ధర్మాన్ని ఆచరించ గలుగుతున్నారా?".

ఉద్ధవా! కృష్ణయ్య ఎన్నడైనా తన తల్లిని స్మరిస్తున్నాడా? తనతో ఆటలాడిన గోపబాలకులను అతడు విస్మరించలేదు కదా! తన ప్రియమైన గోవులను అతడెన్నడైనా స్మరిస్తున్నాడా? అతని రాకకై నిరీక్షిస్తూ అందులకే జీవిస్తున్న వ్రజవాసులను అతడెలా విస్మరించగలడు? బృందావనం, యమున గోవర్ధనం యివన్నీ నేడు అతనికై నిరీక్షిస్తున్నాయి. తలయెత్తి గోవర్ధనగిరి అతనికై ఎదురుచూస్తూన్నది. యమున, బృందావనాలు శ్యామసుందరుడు లేకపోవడంవల్ల శుష్కించిపోతున్నాయి. ఉద్ధవా! నిజంగా అతడు వస్తాడా? అతని సుందర వదనారవిందం శుకనాసికనుపోలిన నాసిక అతని చంచలమైన చూపులు మందస్మితము. నాయీ నేత్రాలకు సందర్శించే అవకాశం లభిస్తుందా? శ్రీకృష్ణుడు నా నందనుడు మాత్రమే కాదు. వ్రజవాసులందరకు ప్రాణదాత. దావానలం నుండీ, సుడిగాలినుండీ, భయంకర వర్షంనుండీ, వృషాసుర, అఘాసురులనుండీ, ఇంకా ఎన్నో పర్యాయాలు మృత్యుముఖంనుండీ అతడు మమ్ములను సంరక్షించాడు. ఈదృష్ట్యాకూడ మేమందరం అతనికి కృతజ్ఞులమైయున్నాము. ఇలాంటి రోజు కోసమే అతడు మమ్మల్ని సంరక్షించాడా? ఈ దుఃఖాన్ని కలుగజేయడానికే అతడు మాకు సుఖాలను ప్రసాదించాడా?.

ఉద్ధవా! ఏమని ఎంతని చెప్పాదును? నేను శ్రీకృష్ణుని శక్తినీ, లీలల, క్రీడల వదనారవిందము వక్రభృకుటి, నల్లని గిరజాలు తిరిగిన కేశాల, అవన్నీ నాముందు నాట్యం చేస్తున్నాయి. నా ముందుగా అతడు చిరునవ్వుతో ఉన్నట్లు కానవస్తున్నది. నాఒడిలో కూర్చుని "నాన్నగారూ! అని నన్ను పిలుస్తున్నట్లు అనిపిస్తున్నది. అతడు నావెనుకగా వచ్చి నాకళ్లు మూసేవాడు. నా ఒడిలో కూర్చుని నా గడ్డాన్ని పీకేవాడు. ఆ ఘట్టాలన్నీ నేడుకూడ నాస్మరణకు వస్తున్నాయి. ఆరసంలోనే నేను నేడుకూడ మునిగి పోతున్నాను. కానీ దైవమా! అతడెక్కడ? అరుణారుణాధరాలూ, కమలనయనాలు గల శ్యామసుందరుని బలరామ సహితులైన గొల్లపిల్లలతో క్రీడించడం నేను ఎప్పుడు చూస్తాను. ఈజీవనానికి (ధిక్కారం) అవమానకరంగా కృష్ణుడులేకుండా నేనింకా బ్రతికియేవున్నాను. అతడు వస్తాడన్న ఆశయే లేకుంటే నామరణ వార్తవిని అతడు దుఃఖిస్తాడని తలచి నేను బ్రతికి వున్నాను. లేకుంటే యీ పాటికి నా అంతమైపోయేదే? కంసాదులను అంతంచేసే వేళలో నేనుకూడ నాకనులారా అతని బలపౌరుషాన్ని చూసి అతణ్ణి భగవంతునిగా గ్రహించాను. గర్గాచార్యులవారు కూడ యీవిషయమై విశేషంగా వర్ణించాడు కూడ. ఇది సత్యమే కావచ్చు అయినా అతడు నా పుత్రుడే కదా! ఏది ఏమైనా నాటి ఘట్టాలన్నీ నా స్మృతిలో మెదులుతున్నాయి. అతడు చిన్నికృష్ణుడుగా వున్న వేళలో నాఒడిలో కూర్చుని ఆడేవాడు. ధూళి ధూసరితమైన శరీరంతో అతడు వచ్చి నాబట్టలను మాపి వేసేవాడు. నా ఒడిలోకి తీసుకుని నేను అతణ్ణి ఆడించేవాణ్ణి, మరి అతడు నా బిడ్డకదా! నాకు మరేమీ తెలియదు."

పైవిధంగా భాషిస్తూ నందుడు వాత్సల్యసాగరంలో మునిగిపోయాడు. కనులనుండి అశ్రుధారలు ప్రవహించాయి. అతని మనసు శ్రీకృష్ణలీలలో తల్లీనమైపోయింది. ఇంక అతడు మాటలాడలేక పోయాడు. మౌనం వహించాడు. అక్కడే కూర్చున్న యశోద పతిపలుకులు వింటున్నది. ఆమెకనులనుండి కన్నీటిధారలూ, స్తనాలనుండి క్షీరధారలూ ప్రవహించసాగాయి. నందుడు ప్రేమముగ్ధుడు కావడం చూసి ఆమె అతని దగ్గరగా వచ్చింది. సంకోచం లేకుండ ఉద్ధవుణ్ణి ప్రశ్నించసాగింది. "ఉద్ధవా! నువ్వు నాకన్నయ్య దగ్గర వుంటూన్నావు కదా! పైగా అతనికి స్నేహితుడవు!

అతడు సుఖంగా వుంటున్నాడా? నిద్రపోయిలేచి దధినవనీతాల కోసం నాదగ్గరకు పరుగెత్తుకు వచ్చేవాడు. అక్కడ అతనికి అంతప్రొద్దుటె ఎవరు భోజనం పెడతారు? నా మోహనుడు రెండు ఝాముల వేళనే తింటూన్నాడా? అతడు చిక్కిపోలేదు కదా! విచారిస్తుంటే అతని సుందరవదనం వాడిపోలేదు కదా! అక్కడి వాతావరణంలో చిక్కుకుని అతడు నన్ను మరువలేదు కదా! ఎవరైనా ఎక్కడైనా తమ తల్లిని మరుస్తారా? నా ఏకమాత్ర సంతానం కన్నయ్యే కదా! ఏదైనా పని చేయించుకోవాలని నాతో అవసరమొచ్చి వాడు పట్టుదల పడితే పనిపూర్తి ఆయేదాకా నన్ను యేమీ చేసుకోనిచ్చేవాడు కాదు. అక్కడ ఎవరి దగ్గర పట్టుపడతాడు? నావలె అతణ్ణి ఎవరు గారాబంగా చూస్తారు? వాడి పట్టుదలను ఎవరు పూర్తి చేస్తారు? నా కన్నయ్య ఈవ్రజమునకే సర్వస్వమైన వాడు. కులదీపకుడు, వాడికి అన్నం పెట్టీ, పాలు త్రావించీ రోజులను, క్షణాలుగా గడిపేదాన్ని. నాటి విషయం నువ్వు ఆలకించియే వుంటావు. భాస్కరుని రాగరంజితకిరణాలు వృక్షాలను చుంబిస్తున్నాయి. తన్మయభావంతో నేను పెరుగును చిలుకుతున్నాను. నాకన్నయ్య యింకా నిద్రపోతున్నాడనుకుంటున్నాను. హఠాత్తుగా కృష్ణయ్య వచ్చి వెనుకగా నిలచి నాకళ్ళు మూసివేశాడు. వాని కోమల కరస్పర్శను పొంది నేను ఆనందమగ్ననయ్యాను. నెమ్మదిగా వాణ్ణి నాచేతులతో పెనవేసి పట్టుకొని నాఒడిలో కూర్చోబెట్టుకొని పాలుత్రాగిస్తున్నాను. అప్పుడప్పుడు వాడు పాలుత్రాగడం మాని నావైపుచూడసాగాడు. ఎంతో సుందరమై, కోమలమై మరకతమణి సదృశంగా వాని కపోలమున్నదో కదా! అరుణాధరాలలో నుండి ధవళ (తెల్లటి) కాంతులతో దంతపంక్తిమెరుస్తోంది. ముగ్ధనై పాలధారలతో నున్న వాని వదనారవిందాన్ని సందర్శిస్తుండిపోయాను. మరల కన్నయ్య పాలుత్రాగడం ఆరంభించేవాడు. ఉద్ధవా! ఆరోజులను నేను మరవలేకపోతున్నాను. నాడు నేను నామోహనుణ్ణి రోటికి బంధించినాను. ఎందుకు? ఓ చిన్న అపరాధానికి. వాడు పాలకుండలు బ్రద్దలుకొట్టాడు. వెన్నను కోతులకు పంచిపెట్టాడు. ఆ ఘట్టాన్ని తలంచిన యిప్పుడు కూడ నాగుండె దడదడలాడుతుంది. నేనేమైనా పాలను, వెన్నను కన్నయ్యకంటె విశేషంగా కోరుతున్నానా? లేదులేదు.

ఉద్ధవా! కలలో కూడ నాకు అట్టి భావం లేదు. రాదుకూడ. ఇప్పుడు కూడ నా దగ్గర పాలూ, పెరుగూ, వెన్నా వున్నాయి. కానీ నా ప్రాణసముడు. నా కంటివెలుగు, నా నోములపంట, నాకన్నయ్య నాదగ్గరలేడు. వాడు లేకపోవడం వల్ల యివన్నీ నన్ను జ్వలింప జేస్తున్నాయి. చూడు, ఇది ఆ ప్రాంగణమే, ఆద్వారమే, ఆయిల్లే, ఆవీధులే, ఆబృందావనమే. కృష్ణయ్య లేకపోవడం వల్ల యివన్నీ నాకు వేదననే కలుగజేస్తున్నాయి. కృష్ణాన్వేషణలో నానయనాలు లగ్న మైపోతున్నాయి. వాడు కానరాక యివి మరలి వస్తున్నాయి. అప్పుడప్పుడు అనిపిస్తూంటుంది. ఈ కనులే లేకపోతే ఎంత బాగుండేదని యమునా తీరం చేరి గంటల కొద్దీకూర్చుంటాను. తరంగాలను లెక్కిస్తాను. ఆ శ్యామజలాలలోనే నా కృష్ణయ్య ఎక్కడో దాక్కొని వుంటాడనుకుంటాను. గంటల కాలంగడచినా అతడు రాకపోయేసరికి నా కళ్ళమీద నాకు కోపం వచ్చి వాటిని కొడుతుంటాను. శ్యామసుందరుణ్ణి కాక ఎవరిని చూడాలి. కానీ అతణ్ణి చూడాలన్న లాలసతోనే వీటిని రక్షించుకుంటున్నాను. ఉద్ధవా! నా అభిలాష ఎన్న డైనా నెరవేరుతుందా? రెండు నాళ్ళైనా వుండి వెళ్ళడానికి కన్నయ్య నా దగ్గరకు వస్తాడా? వాణ్ణి నేను మరల నా ఒడిలోకి తీసుకోగలుగుతానా? నా జీవితం నా నేత్రాలు సఫలమవుతాయా?"

యశోద నయనాల నుండి అశ్రుధారలు ప్రవహించసాగాయి. కంఠం గద్గదికమయింది. ఆమె మౌనంగా ఉద్ధవుని వైపు చూడసాగింది. యశోదానందుల అలౌకిక ప్రేమను తిలకించి ఉద్ధవుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. అతడు మాటలాడలేక పోయాడు. అతనిలో ఆది నుండీ శాంతభక్తి వుండనే వుంది. దాస్యభావానికి లోటే లేదు. సఖ్యాంకురాలు కూడ మొలకలెత్తుతున్నాయి. అట్టి మానసిక స్థితిని గమనించియే శ్రీకృష్ణుడు అతణ్ణి బృందావనానికి పంపాడు. బృందావనంలో అడుగిడిన ఉత్తరక్షణంలోనే ఉద్ధవునికి సఖ్యరసం పరిపూర్ణంగా లభించింది. శ్రీదామాది గోపకులను కలిసిన తరువాత సఖ్యరసపరిపూర్ణత్వం అంటే ఏమిటో అతడు గ్రహించగలిగాడు. వ్రజంలో ప్రవేశించిన అతడు ఇంటింటా ప్రతీ వనంలో అక్కడి పశుపక్ష్యాదులూ, మానవులూ అందరికందరూ శ్రీకృష్ణచంద్రుని లీలలను గానం చేస్తూండటం గమనించాడు. అక్కడి

ప్రత్యణువునుండీ శ్రీకృష్ణనామమే వెలువడుతున్నది. యశోదానందుల దగ్గరకు వచ్చి అతడు వాత్సల్యరసాన్ని దర్శించాడు. వారివెలా సముదాయించాలో అతనికి తెలియడంలేదు. కృష్ణుని మహైశ్వర్యాన్ని వీరికి వర్ణించాలని చిట్టచివరకు నిశ్చయించుకున్నాడు. అతడు వర్ణింప సంసిద్ధుడయ్యేసరికి నందుడు సావధానుడై సుఖాసీనుడయ్యాడు.

ఉద్ధవుడు ఆరంభించాడు, నందబాబా! అమ్మా! యశోదా! మీరు ధన్యులు. మీజీవనం సఫలమయింది. నారోమరోమం జిహ్వలుగా మారినా మిమ్మల్ని పూర్తిగా ప్రశంసించజాలను. పరిపూర్ణతముడైన శ్రీకృష్ణ భగవానుని క్షరాక్షరాతీతుడైన పురుషోత్తముని మీద మీయీ సుందర భావం, యిట్టిభక్తి వీటి మహిమను ఎవరు వర్ణించగలరు? తీర్థయాత్రలు, తపస్సులు దానజ్ఞాన సమాధులు వీటిద్వారా లభించునట్టిదికాదు ప్రేమ. లక్షణభక్తి మీకు సహజంగా లభించింది. శ్రీకృష్ణ భగవానుడు మీ పుత్రుడే కాదు. అతడు తండ్రులందరికీ తండ్రి. విశ్వమునకు మూలకారణుడైన అతని శక్తియే బలరాముడు. అతని ప్రేరణవల్లనే విశ్వంలో జ్ఞానం ప్రాదుర్భవించింది అతని వల్లనే సర్వులూ ప్రయత్నశాలురవుతు వుంటారు. ఎవరైనా సరే మృత్యుసమయంలో క్షణకాలమైనా ఆదేవదేవుని చింతించగలిగితే అట్టివాని కర్మలన్నీ ప్రక్షాళితమై పోతాయి. అట్టివాడు బ్రహ్మస్వరూపాన్ని పొందుతాడు. అట్టివానితో మీకు సంబంధంవుండనే వుంది. అతణ్ణి కేవలం మీ పుత్రమాత్రునిగా భావించకండి. సర్వకారణునిగా సర్వాత్మునిగా అతణ్ణి గ్రహించండి. ఇలా మీరతణ్ణి భావించగలిగితే మీకు కర్తవ్యాలేవీ శేషించవు.

శీఘ్రకాలంలోనే శ్యామసుందరుడు యిక్కడకు వస్తాడు. శరీరదృష్ట్యా అతణ్ణి చూడాలని మీరనుకుంటే అదీ జరుగుతుంది. మీరతణ్ణి ప్రేమించండి. అతడు మీ దగ్గరకు రాకపోవడమన్నది జరుగదు. కంసాది దుష్టులను సంహరించిన తరువాత యదువంశీయుల రక్షణ దీక్షా భారమంతా అతని మీదనే వుంది. ఆ యేర్పాట్లుకాగానే అతడిక్కడకు వస్తాడు. గోపకులు అక్కడనుండి వెళ్ళే సమయంలో శ్రీకృష్ణుడు పలికిన ప్రకారం తప్పక ఆచరిస్తాడు. మీరు మహా అదృష్టవంతులు, మీరు మీ దగ్గరలోనే శ్రీకృష్ణుణ్ణి

దర్శించగలుగుతారు. ఆదేవదేవుడు మీకు దూరంగా లేడు. అతడు మీ అంతరాత్మయే. కాష్ఠంలోని అగ్నివలె అతడు సర్వత్రా వ్యాపించివున్నాడు. అతనికై భిన్నులు కావలసిన పనిలేదు. అతనికి ప్రియాప్రియమన్న వారెవరూ లేరు. అతని దృష్టిలో ఉన్నతులూ, నీచులన్నవారెవరూ లేరు. అతడు సర్వత్రా సమానుడే. అభిమానం అతణ్ణి స్పృశించదు. అతనికి తల్లీ, తండ్రీ, పత్నీ, పుత్రులూ అన్నవారెవరూ లేరు. తనవారూ, పరాయివారూ అన్నభావం అతనిదృష్టిలో లేదు. జన్మకానీ, శరీరంకానీ, అతనికి లేవు. కర్మలన్నవికానీ, కర్మఫలానుభవం అన్నమాటకానీ ఏదీలేదు. అతడు తన వారైన భక్తులకోసం లీలావతారాలను గ్రహిస్తూంటాడు.!

సత్త్వరజస్తమో గుణాలు మూడున్నాయి. అతడు నిర్గుణుడైకూడ క్రీడార్థం ఈగుణాలను స్వీకరిస్తుంటాడు. సృష్టిస్థితిలయములను కొనసాగిస్తుంటాడు. గిరగిర తిరిగే చక్రాదులపై కూర్చున్నవానికి ప్రపంచమంతా తిరుగుతున్నట్లు కనిపించినట్లే కర్త, భోక్త కూడ చిత్తమే అయివుంది. తదారోపణ ఆత్మపై కొనసాగుతున్నది. శ్రీకృష్ణుడు మీ యిద్దరిపుత్రుడే కాదు, అతడు భగవంతుడు అందరిపుత్రుడు. అందరికీ తల్లీ, తండ్రీ, అందరికీ భగవంతుడూ, అందరి ఆత్మా అతడే. ఎన్నడో జరిగినదీ, యిప్పుడు జరుగుతున్నదీ, భవిష్యత్తులో జరుగబోయేదీ, కనబడేదీ, వినబడేదీ, జనచైతన్యమైనదీ, చిన్నదీ, పెద్దదీ, సర్వం శ్రీకృష్ణుడే. కృష్ణాతిరిక్తంగా ఏవస్తువులేదు. సర్వం అతడే, కేవలం అతడే వున్నాడు. ఏకమాత్ర పరమార్థవస్తువు కూడ అతడే.

ఇలా వారిమధ్య సంభాషణ కొనసాగుతుండగా రాత్రి గడచింది. గోపికలు తమతమ యిళ్ళల్లో మేల్కొంచి దేవతలకు ప్రణమిల్లి పెరుగును చిలకసాగారు వారు ఏకస్వరంతో "గోవిందా! దామోదరా! మాధవా!" ఆదిగా గల శ్రీకృష్ణనామాలతో మధురంగా పాడసాగారు. ఏక కంఠంతో వెలువడే వారిసంకీర్తన ధ్వనులు ఆకాశంలో ప్రతిధ్వనించ సాగాయి. దశదిశలూ ఆ ధ్వనులతో మారుమ్రోగాయి. వారి ఆప్రేమగానాలను ఆలకించి ఉద్ధవుడు తన సంభాషణను ఆపాడు. నిత్యకృత్యాలకై అతడు యమునాతీరానికి వెళ్ళాడు."

సఖ్యము, వాత్సల్యము, మాధుర్యము మొదలగునవి భగవత్సంబంధమైన భావాలలో ప్రధానమైనవి. భగవంతునితో యేర్పడే సంబంధాలన్నీ ఉత్తమమైనవే. కానీ వ్రజభూమిలో యీ మూడింటికీ విశేషం ఉంది. ఈ మూడింటిలో కూడ మాధుర్యభావం పరమభావమై, రహస్యరసమై ఉంది. భగవంతుని, సఖ్యవాత్సల్యభావాలతో పరిచయం లేనివారు యీ మధుర తమరసంలో ప్రవేశించజాలరు. మధుర భావమంటే ఏమిటి? ఆత్మ ఆత్మతో రమించుట. భగవంతుని నిజాత్మస్వరూపంతోను అంతరంగ శక్తులతోనూ, భగవన్మయమైన దివ్యక్రీడయే ఆనందప్రేమల సంయోగము. త్రిగుణాతీతమై ప్రకృత్యాతీతమైన ఆత్మస్వరూపమే రసము. తదా స్వాదనము. దీనినే ఉజ్జ్వలరసమనికూడ అంటారు.

ఈ వుజ్జ్వలరసంలో ఐక్యతే వున్నా రెండురకాల అవస్థలు దృగ్గోచరమవుతుంటాయి. ఒకటి సంయోగము, రెండు వియోగము. భగవంతునితో కలయిక అతనితోటి రాసక్రీడావకాశాలు మహాభాగ్యశాలురైన వారికి మాత్రమే లభిస్తాయి. దానిని ఎంతగా కోరినా గోపికల పాదరజస్సును హృదయంలో ధారణచేయనిదే వారు పొందజాలరు. భగవద్విముఖులైన వారే ప్రపంచంలో విశేషంగా వున్నారు. భగవద్వియోగంలో ఉన్నవారు కూడ కోరుకుంటే ఆదివ్యరసలాభాన్ని పొందగలరు. వియోగమార్గంలో కూడ ఎన్నో ఆటంకాలున్నాయి. ఈ మార్గంలో సాధకుడు అడుగడుక్కి నిరాశుడవుతుంటాడు. ఇన్నాళ్ళు గడచినా శ్రీకృష్ణుడు యింకారాలేదే అన్న భావం సాధకునికి కలుగుతుంది. ఇంక అతనురాడు అని భావించుకుంటూ అతడు సాధన విరతుడవుతాడు. అలా కారాదు. ఈ విషయాన్ని మనం గోపికలద్వారా నేర్చుకోగలుగుతాము.

బృందావనం నుండి మధుర మూడు క్రోసుల దూరంలో వుంది. శ్రీకృష్ణుడు రెండురోజులకోసం అక్కడకు రావాలంటే ఏమంత కష్టం కాదు. లేదా గోపికలయినా కొన్నాళ్ళు కృష్ణుని దగ్గర వుండుటకు వెళ్ళవచ్చును. అలాచేసిన నాడు వారి జీవనంలో వియోగ ధర్మం నెరవేరదు. గోపికలు శ్రీకృష్ణునికి దూరంగా ఎంతమాత్రం లేరు. ఈ వియోగలీల వియోగీ సాధకులకు ఆదర్శం కోసం జరిగింది. మధ్యలోనే గోపీకృష్ణుల కలయిక

జరిగివుంటే వియోగసాధనకు ఆదర్శం ఏర్పడేది కాదు. ఈ మహాధర్మాన్నుండి నీతిని గ్రహించడానికి అనండి లేదా ఈ మహాధర్మాన్ని విశ్వంలో ప్రకటించాలని, ఉద్ధవుడు వ్రజభూమిలో గోపికల దగ్గరకు వచ్చాడు. ఈ రెండు విషయాలపరిణతిని మనం ఉద్ధవుని జీవితం నుండి గ్రహించ గలుగుతాము. ఉద్ధవుడింకా నేర్చుకుంటున్నాడు. నేర్చుకోవడానికే అతడు వచ్చాడు కూడ. భవిష్యత్తులో అతడు కృష్ణ వియోగంలో సయితం ప్రాణాలతో వుండవలసివస్తుంది. విశ్వసమక్షంలో అతడు ప్రేమ భక్త్యాదర్శాన్ని స్థాపించవలసి వుంది. తద్రహస్యాన్ని అతడు వ్యక్తం చేయవలసి వుంది. వ్రజంలో అతడు గోపికలలో యేమి చూశాడు? ఏమి నేర్చుకున్నాడు? ఈ చర్చప్రాసంగికమైనది.

సూర్యోదయసమయం. పాలుపితకడంపూర్తి అయింది. దధిమథన ధ్వనులు కూడ సన్నగిల్లసాగాయి. పచ్చటి చెట్లపై రంగురంగుల పక్షులు కిలకిలారావాలు చేస్తున్నాయి. పక్షిపిల్లలు తోటివాటితోనూ, తమ తమ తల్లులతోనూ, ఆడుకుంటున్నాయి. ప్రేమయొక్క కరుణామిశ్రితధారలు నలువైపులా వ్యాపించి ఉన్నాయి. అన్నివున్నాయి. కానీ శ్రీకృష్ణుడు ఉన్నప్పుడుండే ఆ ప్రకాశం లేదు. అక్కడి వారిలో ఉత్సాహం లేదు. స్ఫూర్తిలేదు. వారందరికందరూ కార్యకలాపాలలో కానవస్తున్నారు.

గోపికలు యిళ్ళనుండి బయటకువచ్చారు. నందుని గృహప్రాంగణంలో ఓ సుందర సువర్ణరథం నిలబడి వుండడం వారు చూశారు. అందరి హృదయాలలోనూ శ్రీకృష్ణుడు ఎక్కివెళ్ళిన యీరథంలో ఎవరువచ్చారా? అన్న కుతూహలం కలిగింది. ఈ రథం తిరిగి ఎవరికోసం వచ్చింది? కృష్ణనామశ్రవణ మాత్రంచే అధికులనయనాల నుండి అశ్రువులు ప్రవహించాయి. ఎందరో తమ మనస్సులను అణిచిపెట్టుకొని వుండిపోయారు. విద్రాణమై ఉన్నవారి మనస్సులుపొంగాయి. ఇప్పుడెవరిని తీసుకు వెడతారో? ఇక తీసుకువెళ్ళడానికి మాత్రం ఏముంది? శ్రీకృష్ణుడు వెళ్ళాడు. మన ఆత్మలూ వెళ్ళాయి. మనప్రాణాలు వెళ్ళాయి. ఇక కంకాళాలు మాత్రం మిగిలాయి. వాటిని ఎవరు ఏమిచేసుకుంటారు. మనం శ్రీకృష్ణుని వారము. నేను వస్తాను అని అతడు

చెప్పనే చెప్పాడు. అతని వాక్యం అసత్యమవుతుందా? అతడు వస్తాడు. అంతవరకూ మనం సజీవంగా వుండవలసిందే. అతడు మరలివచ్చే సరికి మనం లేకుంటే అతడు బాధపడతాడు. అందుకే మనం బ్రతికివుండాలి.

సరిగ్గా అదే సమయంలో యమునలో స్నానమాడి వస్తున్న ఉద్ధవుడు కనిపించాడు. అతణ్ణి దర్శించేసరికి వారికి మరీ ఆశ్చర్యం కలిగింది. అదే శరీరం, అలాంటి భుజాలే కమలసమమైన అట్టి నేత్రాలే, గళసీమలో కమలహారం, పీతాంబరం ధరించివున్నాడు. ముఖసీమలో అట్టి ప్రసన్నతయే నాట్యమాడుతున్నది. కానీ యితడు మాత్రం శ్రీకృష్ణ సమంగా ఎక్కడ నుండి వచ్చాడు. అయినా కాకపోయినా అతని అనుచరుడే అయివుంటాడు. అయితే అతడు మనలను స్మరిస్తున్నాడా? మనం అతని కోసం ఎంతగా విలవిలలాడుతున్నామో అంతగా అతడూ వేదన పడుతున్నాడా? విలవిలలాడవచ్చునులే లేదులేదు. లేకుంటే రెండురోజులు మనదగ్గర వుండి వెళ్ళిరావచ్చును కదా! అదిపరే మాటలవల్లనే అతని హృదయం శాంతిస్తుందా? అతనికి ఓదార్పు లభిస్తుందా? ఇది అసంభవం! మనకోసం ఏమైనా అతడు సందేశాన్ని అందజేసి వుండవచ్చును. పంపకపోతే మాత్రం ఏమి? అతని అనుచరుడే కదా, ఇతనితో సంభాషిస్తే అతని విషయాలు కొన్ని అయినా తెలుస్తాయి నడవండి. అందరం అతని దగ్గరకు వెడదాము. ఈలోగా ఉద్ధవుడే వారిని సమీపించాడు.

గోపికలు అతణ్ణి కృష్ణ సమంగా భావించి సత్కరించారు. ఏకాంతంగా పిలచి వారు అతణ్ణి అడిగారు "ఉద్ధవా! నువ్వు కృష్ణప్రేమివై అతని అంతరంగ సఖుడవైయున్నావు. అతని హృదయాంతరవిషయాలలో కొన్నింటినైనా చెప్పగలవా? అతడు కేవలం యశోదానందుల కోసమే నిన్ను పంపివుంటాడు. వ్రజంలో వారు తప్ప అతణ్ణి స్మరించదగిన వారు మరెవరున్నారు. అతడు పూర్తిగా మమ్మల్ని విడనాడినట్లేనా? ఇక అతడిక్కడకు రాడా? అదిఎలా సంభవం? అతడువస్తాడు. అవశ్యంవస్తాడు. ఉద్ధవా! మా హృదయదశను ఏమనివర్ణించగలము? మా ఆత్మలు ఎంతగా వేదనచెందుతున్నాయో ఎవరు గ్రహించగలరు? ఈవేదనకు అంతమనేది వున్నదా?" అది మాకు కానరావడం లేదు. ఎంతగా మేము ప్రయత్నించినా

యీ వేదన వర్ధిల్లుతున్నదే కాని తగ్గడం లేదు. ఎవరితో చెప్పుకుంటాము. చెప్పుకుంటే మాత్రం లాభమేమిటి?.

ఉద్ధవా! అతని సౌందర్యవర్ణన మేమువిన్ననాటి నుండీ అతని రూపమాధురిని సందర్శించినప్పటినుండీ, అతని మధురమురళీనాదం విన్ననాటినుండీ అలా అననేల వాస్తవానికి అంతకు ముందే మేము అతనికి అంకితమైపోయాము. అతడు తన ప్రేమమయదృక్కులతో, మందస్మితంతో, అనుగ్రహపూర్ణమైన భృకుటీవిలాససంకేతాలతో మమ్మల్ని అనుగ్రహించాడు. అతడు స్వీకరించకపోయినా మేము అతని వారమే కానీ మమ్ము స్వీకరించడంతో అతనిపై మాకు హక్కు ఏర్పడింది. అధికారం ఏర్పడింది. మా యిచ్ఛాతీతంగా క్షణకాలం కూడ వాస్తవానికి అతడు మానుండి దూరం కారాదు. కానీ మేము అలా కోరడం లేదు. మనసాకోరుకున్నా అతనిపై ఎట్టి వత్తిడీ తేవడం లేదు. అతనితో చెప్పడం లేదు. కానీ ఇదే రీతిగా మాలో మేము ఎంతకాలమని కృశించి నశించి పోగలము? చాలాకాలం శాంతిగా నిరీక్షిస్తుండి పోయాము కూడ. పోనీ రోజులు శీఘ్రంగా గడుస్తున్నాయా అంటే అదీలేదు. పర్వతసమంగా రోజులు మాకు మహాభారమై పోతున్నాయి. అపారసాగర సమమై పోతూన్నాయి. మేమేమి చేయుదుము? ఈ రోజులను ఎలాగడిపెదము క్షణం మాకు యుగమై పోతూన్నది. కనులనుండి అశ్రుధారలు ఆగడం లేదు. సర్వం శూన్యంగానే కనిపిస్తూన్నది. మా యీ శూన్యత్వానికి అంతమనేది ఉందా, లేదా?.

ఉద్ధవా! మా ప్రియతముడైన శ్యామసుందరుడు మా శ్రీకృష్ణుడు గోవులను మేపుటకై అడవులకు వెళ్ళే ఆ రోజులు మాస్మృతిలో మెదులుతున్నాయి. ప్రతిక్షణం వికలభావంతో మేము గడుపుతూ, గుండె దడదడలాడ కమలసమకోమలమైన అతని చరణాలలో ఎక్కడ కంటకాలు(ముళ్ళు) గుచ్చుకుపోతాయేమోనని సందేహించే వారము. అరుణారుణమైన అతని అరికాళ్ళు వేదన చెందునేమోనని మేము బాధపడేవారము.

ఈ విషయానికి పరమాత్మ సాక్షి అన్నవిషయాన్ని మా హృదయాలకు తెలుసు. సుమసమకోమలమైన అతని శ్రీచరణాలను మా కఠోర హృదయాలపై వుంచుకొనే వేళ వాటికి బాధకలుగదు కదా, అని భావించే వారము. ఆవులను మేపుటకై అతడు వనాలకుపోయే వేళలో మేము నందబాబా మందిరద్వారాల దగ్గర అతడు పురోగమిస్తూంటే మార్గమధ్యంలో నిలబడి అతడు కనుమరుగై పోయేవరకూ నిర్నిమేషనేత్రాలతో చూస్తూ వుండిపోయేవారము. పనిపాటలు చూసుకుందామని యిళ్ళకు మరలి వచ్చేవారమే కానీ ఆయా పనిపాటలలో మనస్సు లగ్నమయ్యేదే కాదు. ఒక వేళ బలవంతంగా పనులు చేస్తున్నా శ్యామసుందరుడు మా సమక్షంలోవున్నట్లే అనిపించేది. మేము ధాన్యం దంచుతూండగా అకస్మాత్తుగా అతడు వచ్చి రోకలిని పట్టుకునే వాడు. మేము యిల్లు చిమ్మడానికి చీపురు పట్టుకొనే సరికి నందనందనుడు మా ఎదురుగా నిలబడేవాడు. యమునా జలాలకోసమూ, చల్ల అమ్మాలనీ ఏదో వంకపెట్టి ఎన్నోసార్లు అతని కోసం వనాలకు పోయి అతణ్ణి చూసేవారము. సంధ్యాసమయాన అతడు మరలి వచ్చేవేళ ఆదిలోనే మార్గమధ్యంలో అతని రాక కోసం ఎదురుతెన్నులు చూసేవారము. మురళి వాయిస్తు తోటిస్నేహితులతో అతడు మరలివస్తూంటే గిరజాలు తిరిగిన అతని కేశపాశంమీద, ముఖంమీద వ్రజరజం పడిపోయేది. ఆతని సుందర కపోలభాగంపై స్వేదబిందువులు ముత్యాలవలె మెరిసేవి. ఆ దృశ్యాన్నిచూస్తుంటే చెప్పలేని ఆనందం కలిగేది. రాత్రి వేళల్లో కూడ మేము నందబాబాయింటికి వెళ్ళేవారము. అతడు మురళిని మ్రోయించి మమ్మల్ని వనాలకు పిలిచేవాడు. అక్కడ మాతో క్రీడించేవాడు. ఇప్పుడవన్నీ చెప్పడం వల్ల లాభంలేదు. మేము వ్రతోపవాసాలుచేసి దేవీదేవతలను గౌరవించే హృదయంతో, ఆత్మలో శ్రీకృష్ణుడు మాకు పతి కావాలనుకున్నాము. ఆతడయ్యాడు కూడ, కానీ ఉద్ధవా! ఇప్పుడతడెక్కడున్నాడు? ఇప్పుడు మేము అతణ్ణి గురించి మాట్లాడుతూ అతని సందేశాన్ని పొందుతున్నాము. అతణ్ణి స్మరిస్తున్నాము. కానీ యిప్పుడతడెక్కడున్నదీ తెలియదు. ఆతడు మామధ్యలేడు. మా జీవితం భారమైపోయింది. వ్యర్థమైపోయింది. అంటూ గోపికలు తన్మయులయ్యారు. వారు బాహ్యజ్ఞానాన్ని కోల్పోయారు.

క్రమక్రమంగా గోపికలలో చైతన్యంరాగా వారు పిచ్చివారివలె ప్రవర్తించసాగారు. కొందరు గోపికలు వృక్షాన్ని శ్రీకృష్ణుడనుకొని అతణ్ణి ఎత్తిదెప్పసాగారు. కొందరు లతానికుంజాలలో శ్రీకృష్ణుడున్నాడని మొగంచాటుచేసుకుని మరలసాగారు. కొందరు ఆకుల చప్పుడు విని కృష్ణాగమనాన్ని అపేక్షించి చంప, మాలతి, మొగలి గులాబీ కమలాది పుష్పాలతో కృష్ణసంబంధమై భాషించుకోసాగారు. భ్రమరంమీద దృష్టి పడితే దానిని కృష్ణుడు పంపిన దూతగా తలచి గద్దించి విచిత్రదశను పొందసాగారు. వారు యావద్విశ్వాన్నీ, శరీరాన్నీ, ప్రాణాన్నీ ఆత్మనూ కూడ విస్మరించి కృష్ణునియందే సంలగ్నమైపోయారు. కృష్ణలీలలను వారు గానం చేస్తూ సిగ్గువిడచి యేడ్వసాగారు. ఉద్ధవుని హృదయం ద్రవించింది. ఆ గోపికల విరహోన్నత దశను, తిలకించి అతడు ముగ్ధుడై పోయాడు. అతడెలాగో గోపికలను ఓదార్చాలని ఆరంభించాడు.

"గోపికలారా! మీ జీవనాలు సఫలమైనవి. లోకాలూ లోకాధిపతులందరూ కూడ మిమ్మల్ని పూజిస్తున్నారు. మీకు గల శ్రీకృష్ణ ప్రేమను ఎక్కడాచూడలేదు. ఎక్కడా లేదు కూడ. తీవ్రమైన మహత్తర దాన, తప, వ్రత, హోమ, జప స్వాధ్యాయ సంయమాదులవల్లనూ యితరేతరమైన ఘనతరశ్రేయోదాయక ఉపాయాలవల్లనే, శ్రీకృష్ణభక్తి లభిస్తుంది. * మహా మహాఋషులకు సయితం దుర్లభమైన ప్రేమ మీకు మీ అదృష్టం వల్ల లభించింది. మీరు పుత్ర, పతి, స్వజన, దేహ, గేహాది, సర్వస్వాన్నీ త్యజించి పురుషోత్తముడైన శ్రీకృష్ణభగవానుని పతిరూపంలో దర్శించియుండడం +పరమ సౌభాగ్యకరమై మీరుచేసిన తపస్సుకు ఫలమై లభించింది.

---

* శ్లో. దానవ్రతతపోహోమజపస్వాధ్యాయసంయమైః ।
శ్రేయోభిర్వివిధైశ్చాన్యైః కృష్ణే భక్తిర్హి సాధ్యతే ॥
(భాగవతం 10–47–24)

\+ శ్లో. దిష్ట్యాపుత్రాన్ పతీన్ దేహాన్ స్వజనాన్ భవనాని చ ।
హిత్వావృణీత యూయం యత్ కృష్ణాఖ్యం పురుషం పరమ్ ॥
(భాగవతం 10–47–26)

శ్రీకృష్ణదేవుని విరహంతో మీకు సర్వాత్మభావం లభించింది. మీకు సర్వే సర్వత్రా కృష్ణుడే దర్శనమవుతున్నాడు. మీ దగ్గరకు పంపి శ్రీకృష్ణుడు నన్ను విశేషంగా అనుగ్రహించాడు. మీ దర్శన మాత్రంచే నేను ధన్యుడనయ్యాను. కళ్యాణమయురాండ్రైన గోపికాంతలారా! శ్యామ సుందరుడు మీకై పంపిన సందేశాన్ని వినిపిస్తాను. ఆలకించండి. అది వింటే మీకు పరమానందం కలుగుతుంది. అతని ఏకాంత సందేశంతో నేనిక్కడకు వచ్చాను.

శ్రీకృష్ణుడు తనసందేశంలో, "ప్రియమైన నా గోపికలారా! మీనుండి వేరై నేనుండజాలను. పృథ్వి, జల, వాయువులు ఆకాశానికి వేరైవుండజాలనట్లే మీరూ నేనూ వేరై ఉండజాలము. మీ మనస్సు ప్రాణాలూ, శరీరమూ, ఇంద్రియాలూ, గుణాలూ, మీ సర్వస్వమూ కూడ నాలోనే వున్నాయి. సర్వానికీ నేనే ఆశ్రయుడను. నాలో నేను సృష్టించుకుంటూ, పాలించుకుంటూ, సంహరించుకుంటూ ఉంటాను. నాశక్తి ద్వారా యిన్నిరూపాలనూ ధరిస్తూ ఉంటాను. ఆత్మ జ్ఞానస్వరూపమైనది. అది మాయారహితమై గుణాతీతమైనది. జాగ్రత్, స్వప్న, సుషుప్తులకు కూడ అతీతమైన ఆత్మ సర్వానికే సాక్షీ భూతమై ఉంటుంది. ఈ విషయాలూ, యీ ప్రపంచము, ఆత్మలో స్వప్నసమంగా గోచరమవుతుందే కానీ యిదంతా మిథ్యయే. మిథ్యా సంసారంవైపు దృష్టి పోయినప్పుడే 'వియోగమన్నది యేర్పడుతుంది. ఇంద్రియాలను, మనోవృత్తులను విషయవాసనలవైపు పోకుండ లాగి ఆత్మయందు సంలగ్నం చేయండి. వాటిని అంతర్ముఖంచేయండి. సమస్త సిద్ధాంతాల, సాధనల ఉద్దేశ్యం యింతమాత్రమే, వేద, యోగ, సాంఖ్య, త్యాగ, తపస్సు, దయ సత్యాదుల లక్ష్యంకూడ యిదియే. బాహ్యదృష్ట్యా నేను మీకు దూరంగానే వున్నాను. కేవలం కనులకు మాత్రమే కదా దూరంగా వున్నది. కనుల దూరం దూరం కానేరదు. దూరమన్నది మనోగతమైనది. నేను అక్కడ వుండడం కన్న యిక్కడ వుండడంవల్లనే మీమనస్సు అత్యధికంగా నన్నే స్మరిస్తున్నది కదా! నాచింతన మీకు విశేషంగా కొనసాగుతుంది. ఇలా జరుగుతూ వచ్చింది. ఇలానే జరుగుతుంది కూడ. వృత్తులన్నింటినీ విడనాడి మీ మనస్సులను కేవలం నాయందే లగ్నంచేయండి. నన్ను స్మరిస్తూవుండండి. శీఘ్రంగా

మీరు నన్ను పొందగలుగుతారు. మీకు జ్ఞాపకముంది కదా! నేను రాసక్రీడలో నిమగ్నుడనై వున్నవేళ గోపికలెందరో నన్ను చేరలేక పోయారు. వారు సహృదయులై ప్రేమతో నన్ను స్మరించారు. శారీరకంగా నన్ను చేరిన గోపికలకన్న ముందుగా వారే నన్ను చేరగలిగారు. నేను మీ దగ్గరేవున్నాను. మీ హృదయాలలో వున్నాను. మీ ఆత్మ రూపుడనైవున్నాను". వియోగ మన్నది ఓ వస్తువా? దీనికై వేదన చెందవలసిన పని లేదు. నాకై అన్వేషించకండి. నేను మీ దగ్గరే వున్నానన్న భావంతో సంచరించండి", అని తెల్పాడు.

పైవిధంగా పలికి ఉద్ధవుడు మౌనం వహించాడు. తమప్రియతముని ఆదేశాన్ని, తమ ప్రాణసముని సందేశాన్ని విన్న గోపికలకు మహానందం కలిగింది. ఆ సందేశ శ్రవణమాత్రంచే వారి స్మృతి నవ్యమయినది. * వారు ప్రసన్నులై – ఉద్ధవా! శ్రీకృష్ణుడు ప్రసన్నంగా ఆనందంగా వున్నాడు కదా! మాకు కావలసింది అదే. కంసుడు వాని అనుచరులూ అంతమైపోయారు. జగత్తుకు శుభపరంపరలు చేకూరాయి. శ్యామసుందర సందర్శనంతో మేము ప్రసన్నులమైనట్లే మధురా నగరవాసులు కూడ ప్రసన్నులవుతూంటారు. అక్కడి వారు విశేష ప్రేమికులే అయివుంటారు. వారిప్రేమపాశంలో శ్రీకృష్ణుడు బంధింపబడి వుండిపోవడం స్వాభావికమే కదా! అతడు వారితోవుండిమమ్మల్ని స్మరించగలుగుతున్నాడు, స్మరిస్తాడులే. చంద్రికాచర్చిత బృందావనంలో ఆతడు మాతో ఆడిపాడి కొనసాగించిన రాసలీలా రాత్రులు అతనికి జ్ఞప్తిలో వుండియే వుంటాయి. అతడు మమ్మల్ని సజీవంగా వుంచడానికి యిక్కడకువస్తాడు. ఇప్పుడతడు వనవాసులమైన మాదగ్గరకు ఎందుకు వస్తాడులే. ఆయన ఆత్మారాముడూ,పూర్ణకాముడూ కూడా. అతనికి మాయందు అపేక్ష ఎందుకుంటుంది ? ఆశకంటే నిరాశ మంచిదని మాకు తెలుసును. అయినా శ్రీకృష్ణసందర్శనార్థం మా కనులు నిరీక్షిస్తూనే వుంటాయి. మా ఆశ,

---

* శ్లో. ఏవం ప్రియతమాదిష్టమాకర్ణ్య వ్రజయోషితః ।
తా ఊచురుద్ధవం ప్రీతాస్తత్సందేశాగతస్మృతీః ॥
(భాగవతం 10–47–38)

అభిలాషలు ఊడలవంటివి అవి ఖండింపబడవు. అయినా అతణ్ణి విడువగలవారెవరు? అతడు కోరకపోయినా లక్ష్మీదేవి అతణ్ణి విడనాడి ఒక్క క్షణం కూడ వుండజాలదు.

ఉద్ధవా! యమునాపులినం గోవర్ధన శిఖరం, క్రీడావనాలు, అత్యంతప్రేమపాత్రమైన శ్యామసుందరుని గోసముదాయమూ, ఆ జగన్మోహనుని మధురమురళీనాదమూ, అతని స్మృతిలో పదేపదే మెదులుతూనే ఉంటాయి. ఇంకా బృందావనభూములు అతని శ్రీ చరణాంకితాలైవున్నాయి. మేము వాటిని మరువ గలమా? అతని స్మరణయే మాకు జీవనము. లలితమైన ఆతనిగతీ, ప్రేమామృత భరితమైనవాణీ మందస్మితమూ, లీలాసంభరితమైన ముగ్ధమోహన స్వరూపము వీటిచే మోహింపబడిమేము అతనికి మా హృదయాలను అర్పించివేశాము, మా సర్వస్వాన్ని అతని చరణ కమలాలపై సమర్పించి వేశాము. అట్టివాణ్ణి మేము ఎలా మరువగలము? హేనాథా! హేరమానాథా! హేవ్రజనాథా! హేదీనబంధూ! మేము దుఃఖసాగరంలో మునిగిపోతూన్నాము. మమ్మల్ని రక్షించు, మమ్మల్ని వుద్ధరించు.

కృష్ణసందేశం వల్ల గోపికల విరహజ్వాల విశేషంగా శాంతించినది. వారు ఉద్ధవుణ్ణి శ్రీకృష్ణస్వరూపునిగా భావించి అతణ్ణి సత్కరించసాగారు. 'ఉద్ధవా! నువ్వు రాధారాణి దగ్గరకు వెళ్ళు. భగవద్విరహంలో ఆమె ఏ దశలో ఉందో స్వయంగా చూడు. ఆమె చావలేక బ్రతుకుతూ, బ్రతుకలేక చస్తున్నది. చింత, జాగరణ, మూర్ఛ ప్రళయదశలు క్రమంగా కొనసాగుతున్నాయి. ఆమె ఒక్కోసారి మత్తతలోకి, మరోసారి మోహస్థితిలోకి వెళ్ళి పోతుంది. వెళ్ళి ఆమెను దర్శించు. ఆమె చరణాలలో శిరసు వంచి ఏకొంచెమైనా నేర్చుకో! అని గోపికలు పలుకగా ఉద్ధవుడు రాధారాణి సన్నిధానానికి పురోగమించాడు.

యావద్విశ్వంయొక్క ఆత్మా శ్రీకృష్ణుడైవున్నాడు. స్వాత్మను భగవత్సన్నిధిలో అనుభవించగలిగిన నాడే యీ జగత్తు సుఖశాంతులను పొందగలుగుతుంది. తద్రహితంగా యీ జగత్తుకు సుఖశాంతి

ఆనందాలన్నవి లభించవు. కానీ శ్రీకృష్ణుని ఆత్మ ఏది? ఏ శక్తిరహితంగా ఆతడు సయితం గిలగిలలాడుతాడో? దేనిని పొందినంతమాత్రమున ఆ దేవదేవుని ఆనందం అనంతానంతంగా వర్థిల్లిపోతుందో? ఆమెయే శ్రీరాధాదేవి, శ్రీరాధాదేవియే శ్రీకృష్ణుని ఆత్మ. ఆమెతో రమించుట వల్లనే శ్రీకృష్ణుడు ఆత్మారాముడనబడతాడు. * శ్రీకృష్ణరహిత అయిన రాధ ప్రాణహీనురాలు కాగా రాధారహితుడైన శ్రీకృష్ణుడు ఆనందరహితుడే అవుతాడు. వీరిద్దరూ ఎన్నడూ వేరు కారు. వేరైనట్లు లీలలు అభినయిస్తారు. అలా చేయడానికి కారణం? ప్రజలు పరమప్రేమ పరమానందాలను ప్రత్యక్షంగా దర్శించగలుగుతారు. ఈ పవిత్రవిషయాలు శ్రీ రాధామాధవులలో మాత్రమే సంపూర్ణంగా మనకు లభిస్తాయి.

శ్రీకృష్ణుడు మధురానగరం వెళ్ళిన నాటినుండీ రాధ దశ విచిత్రంగా వుంది. ఆమెకు నిద్రరావడం లేదు. పగటి వేళ శాంతిగా కూర్చోలేక పోతున్నది. ఒకచో చిత్తవృత్తులు లయమవుతున్నాయి. వేరొకచో ఆమె మూర్ఛపోతున్నది. ఒకచో ఉన్మాదిని వలె ప్రేలుతూన్నది. ఇంకొకచో మధురవీణాసమనాదంతో మురళీమనోహరుడైన శ్యామసుందరుని గుణగానం చేస్తున్నది. + ప్రతిక్షణాన్నీ అత్యంత దుఃఖంతో ఎలాగో గడుపుతున్నది. అహోరాత్రులు గడుస్తూన్న విషయం కూడ ఆమెకు తెలియడం లేదు. అశ్రుధార ప్రవహిస్తూన్నది. నచ్చచెప్పినా ఓదార్చప్రయత్నించినా ఆమె వేదన మరీ ఎక్కువై పోతున్నది.

ఉద్ధవుడు శ్రీ రాధాదేవి సన్నిధికి వచ్చేసమయానికి ఆమె మూర్ఛితావస్థలో వుంది. ఆ సన్నివేశం చూసిన ఉద్ధవుని వాక్కు గద్గదిక మయింది. భక్తితో అతని మెడ వంగినది. శరీరమంతా గగుర్పొడిచింది.

---

* (శ్లో. ఆత్మా తు రాధికా తస్య తయైవ రమణాదసౌ ఆత్మారామ ఇతి ప్రోక్త ఋషిభి స్తత్త్వ దర్శిభిః)

+ (శ్లో. వీణాం కరే మధుమతీం మధురస్వరాం తామాధాయ నాగరశిరోమణిభావలీలామ్ గాయం త్య హో దినమపార మివాశ్రువర్షై ర్దుఃఖాన్నయంత్యహహ సా హృది మేఽస్తు రాధా)

శ్రద్ధాభక్తులతో అతడు స్తుతించసాగాడు. "దేవీ! నేను నీ చరణ కమలాలకు ప్రణమిల్లుతున్నాను. నీ కీర్తితో ప్రపంచమంతా నిండి పోయింది. నీవు శ్రీకృష్ణచంద్రుని నిత్యప్రియమైన ఆహ్లాదినీశక్తివి, శ్యామసుందరుడు ఎప్పుడు ఎక్కడ ఏ రూపాన్ని ధరించి తేజరిల్లుతుంటాడో అప్పుడక్కడ నువ్వూ అదే రూపంతో భాసిల్లుతూ అతనితో వుంటావు. అతడు విష్ణురూపంలో వుంటే నువ్వు మహాలక్ష్మిరూపాన్ని ధరిస్తావు. అతడు సదాశివుడయితే నువ్వు ఆద్యాశక్తివిగా ఉంటావు. అతడు బ్రహ్మ అయితే నువ్వు సరస్వతివి. అతడు రాముడైతే నువ్వు సీతవు. ఇంకా ఏమి చెప్పెదును. తల్లీ! నువ్వు సర్వదా అతనికి అభిన్నవు. పృథ్వీ గంధాలూ, జలరసాలూ, తేజోరూపాలూ, వాయు స్పర్శలూ, ఆకాశ శబ్దాలూ వేర్వేరు కానట్లే శ్రీకృష్ణుడు నీకు దూరమైలేడు. జ్ఞాన విద్యలూ, బ్రహ్మ, చైతన్యాలూ భగవంతుడు అతని లీలలూ ఏకమైనట్లే నువ్వూ శ్రీకృష్ణుడూ అభిన్నులే. అతడు గోలోకేశ్వరుడు కాగా నువ్వు గోలోకేశ్వరివి. దేవీ! నువ్వు మూర్ఛను విడనాడి జాగ్రదవస్థలోకి రా, నాకు దర్శనమిచ్చి శుభాలను చేకూర్చుము."

ఉద్ధవుని ప్రార్థనను ఆలకించి "శ్రీకృష్ణ – శ్రీకృష్ణ" అనుకుంటూ రాధ జాగ్రదవస్థను పొందింది. ఆమె కనులు తెరచి నెమ్మదిగా "కృష్ణ సమశరీరవేషభాషలు కలనువ్వెవరవు? అవశ్యం అతడు నిన్ను పంపి వుంటాడు. పరేచెప్పు ఇక్కడి కతడు ఎప్పుడు వస్తాడు? అతణ్ణి నేనెప్పుడు చూడగలుగతాను? కమల సమమైన అతని కోమల శరీరంలో ఎన్నడైనా చందనాన్ని అలదగల్గెదనా? అని ప్రశ్నించగా ఉద్ధవుడు తన నామధామాదులను వివరించాడు. రాధ చెబుతూనే వుంది. ఉద్ధవా! ఆయమునయేవుంది. ఆశీతల, మంద, సుగంధవాయువే వుంది. ఇది ఆ బృందావనమే కోయిలలు ఆదిలోవలెనే మధుర నాదాలు చేస్తున్నాయి. చందనచర్చితమైన అదే శయ్యవుంది. ఆదిలో వలెనే అలంకార సామగ్రులున్నాయి. కానీ నా ప్రాణ నాథుడెక్కడ ? ఈ దాసి వల్ల జరిగిన అపరాధమేమి? నావల్ల అవశ్యం ఏదో అపరాధం జరిగియే వుంటుంది. హా కృష్ణా! హా రమానాథా! ప్రాణవల్లభా! నువ్వెక్కడున్నావు. అంటూ ఆమె మరల మూర్ఛపోయింది."

ఆమెను యథాస్థితికి తీసుకురావాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. సఖురాండ్రు అనేకోపచారాలు చేశారు. కానీ రాధకు చైతన్యం కలుగలేదు. అప్పుడు ఉద్ధవుడు. "అమ్మా! నేను నీకు ఓ శుభ సమాచారం వినిపిస్తున్నాను. దీనితో నీవిరహం అంతమవుతుంది. శ్రీకృష్ణుడు నీ దగ్గరకు వస్తాడు. శీఘ్రంగా నువ్వు అతణ్ణి దర్శించ గలుగుతావు. నిన్ను సంతోషపరచడానికి అతడెన్నియో ఘనకార్యాలు చేస్తాడు అన్నాడు. శ్రీకృష్ణుడు వస్తాడు. అన్నమాటలు వింటూనే రాధ లేచి కూర్చుంది. ఆమె ఉద్ధవుణ్ణి విశేషంగా సత్కరించింది. అతనికనేక దానాలు యిచ్చి అతడు భుజించి తృప్తుడైన తరువాత శ్రీరాధాదేవి ఉద్ధవునికి వరాన్నిస్తూ! వత్సా! నీకు సిద్ధులన్నీ లభిస్తాయి. నువ్వు భగవద్దాసుడవవుతావు. నీకు పరాభక్తి లభిస్తుంది. ఉద్ధవా! నువ్వు వాసుదేవుని శ్రేష్ఠపార్షదుడవు అయ్యెదవుగాక!"*

ఉద్ధవుడు వెళ్ళే ముందు శ్రీరాధాదేవి అనుమతికోసం వెళ్ళగా ఆమె ఉద్ధవా! మేము అబలలము. మా స్థితిని ఎవరెరుగుదురు? నన్ను మరువవద్దు. నేను విరహికాతరనైవున్నాను. నాకు గృహవనాలలో భేదమేదీ కానరావడం లేదు. పశువులూ, మానవులూ నాకు ఒకేలా కానవస్తున్నాయి. జాగ్రద స్వప్న సుషుప్తులలో నాకు బేధం కానరావడం లేదు. నాస్మృతియే నాకు వుండడం లేదు. కృష్ణాగమన, లీలాశ్రవణాదుల వల్లనూ, సంకీర్తన వల్లనూ కొన్ని క్షణాలు నేను సచేతనంగా వుండగలుగుతున్నాను. నాకు దశదిశలా శ్రీకృష్ణుడే కనిపిస్తున్నాడు. నిరంతరం నేను మురళీధ్వనినే ఆలకిస్తున్నాను. నాకు ఎవరి భయమూలేదు. కులాన్ని నేను లెక్కచేయను. నేను కృష్ణుణ్ణే ఎరుగుదును. అతణ్ణే భజిస్తాను. బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు ఎవని చరణధూళికై వుత్సుకులై వుంటారో? అట్టి వాణ్ణి పొంది కూడ దూరమయ్యాను. నేనెంత దురదృష్టవంతురాలినో ఎవరైనా నా హృదయాన్ని ఛేదించి చూడ వచ్చును. అతడు వినా యీహృదయంలో మరేమీ లేదు. ఉద్ధవా! ఇప్పుడు నాకు అతనితో క్రీడించే ప్రేమ సౌభాగ్యం లభిస్తుందా?

---

*శ్లో. సర్వసిద్ధిం హరేర్దాస్యం హరిభక్తిం చ నిశ్చలామ్ ।
పార్షదప్రవరత్వం చ పార్షదం చ హరేరితి ॥

బృందావననికుంజాలలో నేను నాచేతులతో మాలతీ, మాధవీ చంపకాది పుష్పాలను కోసి మాలకట్టి శ్యామసుందరునికి అలంకరించ గల్గెదనా? రాధామాధవులు విహరించే ఆ వసంతఋతు మధుర రాత్రులు వస్తాయా? అంటూనే ఆమె మరల మూర్ఛపోయింది.

సఖురాండ్రు, ఉద్ధవుడు పునః మేలుకొలుపగా ఆమె పునః చైతన్యాన్ని పొంది. "ఉద్ధవా! ఈ శోకసాగరంనుండి నన్ను రక్షించు. నాకు జెప్పడం వల్ల ప్రయోజనం లేదు. శ్రీకృష్ణవాణిని స్మరిస్తూన్న నామనస్సు చంచలమైపోతూన్నది. విరహిణి వేదనను విరహిణి మాత్రమే గ్రహించగలుగుతుంది. ఇట్టి అనుభవం సీతాదేవికి మాత్రం వుంది. నేనెవరితో చెప్పుకొందును? నా మానసిక వేదనను గురించిన విశ్వాసం ఎవరి కుంటుంది. నా వంటి దురదృష్టవంతురాలు, నా వంటి దుఃఖిత అయిన స్త్రీ గతంలో లేదు. ముందు వుంటుందనడానికి అవకాశం లేదు. నేను కల్పవృక్షాన్ని పొంది కూడ మోసపోయాను. దైవం నన్ను మోసగించింది. శ్రీకృష్ణచంద్రుణ్ణి తిలకించిన నా జన్మ సఫలమయింది. నా హృదయం, నయనాలు స్నిగ్ధమయ్యాయి. భగవన్నామ మధురధ్వనులు విన్న నాప్రాణాలు పులకరించేవి. అతని మధురస్మృతి మాత్రంచే నా ఆత్మతరించేది. ఆతని కరకమలాల స్పర్శను నేను పొందాను. ఆతని ఛత్రఛాయలో నేనున్నాను. దేనిని పొందితే మాత్రం నేనతణ్ణి మరువగలను? శ్రీకృష్ణుడు నేను మరువగలిగినట్టి. వస్తు, జ్ఞాన, శాస్త్ర, దేవతలలో ఎవరూ లేరు. స్థితియొక్క గతి సంభవమైనదే కావచ్చును. మార్గంలేకుండా నడువవలసిన దానిని గతి అని ఎలా అనగలము? ఇది శూన్యశయ్య అంటూ రాధ ఏడ్వడంచూసి ఉద్ధవుడూ, గోపికలూ కూడ ఏడ్వసాగారు. అక్కడి వృక్షలత జడ చేతనాలన్నీ ఏడ్వసాగాయి. ప్రేమ కరుణల అనంతసాగరం పెల్లుబికింది.

ఉద్ధవుడు చాలరోజులు వ్రజంలో వున్నాడు రాధాదేవిని అతడనేక ప్రశ్నలు వేస్తూ ఆమెనుండి ప్రేమ రహస్య జ్ఞానాన్ని పొందుతూ, గొల్లలతో వనాలలో తిరుగుతూ నందయశోదలతో శ్రీకృష్ణలీలాకీర్తనలు చేస్తూ ఆలకిస్తూ గోవులతో క్రీడిస్తూ, వృక్షాలను ఆలింగనం చేసుకుంటూ లతలను చూస్తూ

వుండిపోతున్నాడు. అతని రోమరోమం ప్రేమమయమై పోయింది. అతడు గొల్లవాడైపోయాడేమో తెలియదు. తెలిసినదల్లా అతని హృదయం గోపీభావమయమై పోయింది. ప్రతీవనంలోనూ అతడు గానం చేస్తూ విహరిస్తున్నాడు. అతని హృదయంనుండి యీ సంగీతం వెలువడుతూన్నది. కేవలం గోపికల జన్మయే సార్థకమైనది. వారు మాత్రమే శ్రీకృష్ణుని కలిశారు. కృష్ణప్రేమలేని వారు బ్రాహ్మణులైతేనేమి? మహామునులైన ఎవనికోసం తపస్సులు చేస్తూంటారో అట్టి శ్యామసుందరుడు యీగోపికలకు లభించాడు కదా! గ్రామ సీమలలో వసించే, వనాలలోచరించే యీ గొల్లభామలెక్కడ? వీరికిగల శ్రీకృష్ణ సంబంధమైన అనంతప్రేమ ఎక్కడ? తెలిసినా తెలియకున్నా జ్ఞానమున్నా లేకున్నా శ్రీకృష్ణప్రేమ వుంటే చాలును. తెలియక అమృతాన్ని పానం చేసినా అది సత్ఫలితాన్నే ప్రసాదిస్తుంది కదా. తెలియకుండా శ్రీకృష్ణుని యందు ప్రేమేర్పడినా ఆదేవదేవుడు వారిని తన వారినిగా స్వీకరిస్తాడు. దేవపత్నులకూ, ఇందిరాదేవికీ కూడ లభించని ప్రసాదం గోపికలకు లభించింది. వారు కృష్ణశరీరస్పర్శను పొంది కృతార్థులయ్యారు. నేనిక బృందావనంలోనే వుంటాను. మనుష్యునిగానేకాదు. పశుపక్షి తరులతాగుల్మ రూపంలోనో కనీసం తృణంగానైనా యీ స్థానంలోనే ఉండి పోతాను. శ్రీకాంతుని శ్రీచరణధూళియైనా లభిస్తుంది కదా. శ్రుతులు ఏదేవదేవుని చరణధూళికై అన్వేషిస్తూంటాయో అట్టి ఆ చరణధూళిని పొంది గోపికలు కృష్ణప్రేమలో తన్మయులై పోయారు. ఏదేమైనా స్వజనులనూ, ఆర్యమార్గాన్నీ త్యజించి శ్రీకృష్ణునిచరణారవిందాలను తమవిగా చేసుకోవడం సామాన్యంకాదు. ఆత్మారాములు ఎవనిని ధ్యానిస్తూంటారో అట్టి శ్రీకృష్ణచరణారవిందాలను తమ హృదయాలపై వుంచుకుని యీ గోపికలు తమ హృదయజ్వాలను శాంతింప జేసుకుంటారు. నేను వీరి చరణధూళికికూడ అధికారిని కాను. వీరి పాదధూళికి నేను ప్రణమిల్లుతున్నాను. ఉద్ధవుడు వారి చరణధూళిలో పొర్లాడుతుంటాడు. రెండురోజులపని మీద వచ్చాడు. మాసాలు గడచిపోయాయి.

మధురానగరానికి మరలి పోయే సమయంలో రాధాదేవి ఉద్ధవుని మస్తకంపై హస్తముంచి ఆశీర్వదిస్తూ "నీ మార్గం మంగళమయమగును

గాక, నీకు పరమజ్ఞానం లభించునుగాక సర్వదా నువ్వు భగవంతునికి ప్రేమ పాత్రుడవయ్యేదవుగాక.*

ఆమె యింకాయిలా అంది. శ్రీకృష్ణప్రేమయే సర్వశ్రేష్ఠవస్తువు. అతనిని ప్రసన్నుని చేయగల కర్మయే సర్వశ్రేష్ఠమైన కర్మ. అతనికి సమర్పితమైనదియే సర్వశ్రేష్ఠమైన జీవనము. అతనికై చేసే తపోవ్రత జ్ఞానాలే సఫలమైనవి. పరాత్పరపరిపూర్ణతమబ్రహ్మ అతడే. పరమ సత్యస్వరూపుడూ, జ్యోతిఃస్వరూపుడూ, పరమానందస్వరూపుడూ అయిన నందనందనుని నువ్వు సేవించు. సర్వోపదేశాల సాఫల్యం యిందులోనే ఉంది. ఆ పలుకులు విన్న ఉద్ధవునికి సంపూర్ణజ్ఞానం కలిగినట్టి అనుభవం కలిగింది. అతడు తన ఉత్తరీయాన్ని నడుముకు బంధించి శ్రీరాధాదేవి చరణాలపై పడిపోయాడు. శరీరం పులకరించింది. కనులనుండి బాష్పాలు రాలుతున్నాయి. రాధావియోగభీతితో గట్టిగా ఏడ్వసాగాడు అంతే అదే ఉద్ధవునిదశ. అక్కడనుండి అతడు పోగోరడంలేదు. గోపికలు ఎంతగానో నచ్చచెప్పారు. శ్రీకృష్ణునికోసం రాధ మురళి, అనేకమైన బహుమానాలూయిచ్చి ఉద్ధవా! నువ్వువెళ్ళి నేను శ్రీకృష్ణసందర్శనంచేసే నిమిత్తం అతణ్ణి యిక్కడికి తీసుకురావడానికి ప్రయత్నించు అన్నది. రాధ దగ్గర సెలవు తీసుకొని ఉద్ధవుడు నందుని దగ్గరకు వెళ్ళాడు.

నందుడూ, గొల్లపిల్లలూ ఉద్ధవుని సంబోధించి ఉద్ధవా! నువ్విప్పుడు వెళుతున్నావు కదా మమ్మల్ని శ్రీకృష్ణునికి గుర్తుచెయ్యి. ఈవెన్న, యీ పెరుగూ, యీ వస్తువులూ అతనికియ్యి. ఇవి బలరామునికీ, యివి ఉగ్రసేనునికీ, యివి వసుదేవునికీ యివ్వాలి. మేము మరేమీకోరడం లేదు. మావృత్తులన్నీ, శ్రీకృష్ణచంద్రుని చరణకమలాలమీదనే లగ్నం కావాలి. మావాణి ద్వారా అతని మంగళమయ మధురతమ నామాలే ఉచ్చరించబడాలి. ఈ శరీరం అతనిసేవకే అంకితమైపోవాలి. మాకు మోక్షాకాంక్ష లేదు. కర్మానుసారం మాశరీరం ఎక్కడున్నా పరవాలేదు.

---

* శ్లో- శుభం భవతు మార్గస్తే కళ్యాణమస్తు సంతతమ్ ।
జ్ఞానం లభ హరేః స్థానాత్ కృష్ణస్య సుప్రియో భవ ॥

మాశుభాచరణదానధర్మాలఫలంగా వాసుదేవుని శ్రీచరణాలలో మాకు అహైతుక ప్రేమ స్థిరంగాఉండాలి అన్నారు.

ఉద్ధవుడు మరలి మధురానగరం చేరాడు. వెళ్ళేటప్పుడు అతడు మాధురవాసుల వేషంలో వెళ్ళాడు. మరలి వచ్చేటప్పుడు అతడు గొల్లవారి వేషంలో వచ్చాడు. శ్రీకృష్ణసన్నిధికి వచ్చి అతడు "వాసుదేవా! నువ్వు చాలా కఠినచిత్తుడవు. నీ కరుణ, రసికత్వాలన్నీ చెప్పుకోవడానికేనన్నమాట. వ్రజంలో అడుగుపెట్టిన తరువాత నేను నీ నిష్ఠూరరూపాన్ని చూశాను. నిన్నాశ్రయించుకుని నీకై స్వాత్మసమర్పణ చేసిన వారినందరినీ గంగలో ముంచి వేయడం ధర్మమేనా? మధురను విడిచి శీఘ్రంగా బృందావనానికి బయలుదేరు. అక్కడేవుంటూ నీప్రేమికులకు సుఖసంతోషాలను ప్రసాదించు. ఇతరేతర విషయాలను ఏమిచేసినా ప్రేమను మాత్రం అపకీర్తి పాలుచేయకు". ఉద్ధవుడు కృష్ణసమక్షంలో ఏడ్వసాగాడు. బృందావనానికి వెళ్ళుమని పట్టుపట్టసాగాడు. వెక్కివెక్కి ఏడుస్తూనే అక్కడివిషయాలన్నీ వివరించాడు.

శ్రీకృష్ణుని నయనాలలో అశ్రువులు కూడ జలజలరాలసాగాయి. తత్సమయంలో అతని సత్యస్వరూపం సాక్షాత్కరించింది. శ్రీకృష్ణుని ప్రతిరోమం గోపికామయం కావడం ఉద్ధవుడు గమనించాడు. సావధానుడై వాసుదేవుడు ఉద్ధవునితో అంటాడు "ప్రియసఖా! ఉద్ధవా! ఇదంతాలీలయే. నేను గోపికలూ వేరు కాదయ్యా! నాలో వారున్నట్లే, వారిలో నేనున్నాను. ప్రేమికుల ఆదర్శార్థం యీసంయోగ, వియోగలీల కొనసాగుతూ వుంటుంది", అన్నాడు. దానితో ఉద్ధవుడు సమాధానపడ్డాడు. సర్వులూ పంపిన కానుకలను అతడు వారికి అందించాడు. తరువాత శ్రీకృష్ణుని దగ్గరనే వుంటూ ప్రీతిపూర్వకంగా అతణ్ణి సేవించసాగాడు.

సర్వధర్మాల లక్ష్యమూ ప్రేమ ధర్మము, సమస్త నీతుల ఉద్దేశ్యము ప్రేమనీతిని చేరుకోవడమే. ప్రేమ ధర్మాతీతమయింది. నీతులకు కూడ అతీతమయింది. కానీ సర్వధర్మాలూ, సమస్తమైన నీతులూ ప్రేమలో అంతర్భూతమైవున్నవే. ప్రేమలేని ధర్మం ధర్మమే కాదు. ప్రేమ లేని నీతి

నీతియే కాదు. ప్రేమ వ్యాపకమైనది కాగా నీతి ధర్మాలు వ్యాప్యమైనవి. నీతి ధర్మాలు లేకుండా ప్రేమ వుండగలదు. కానీ ప్రేమ లేకుంటే అవివుండజాలవు. సంపూర్ణనీతుల జ్ఞానముండును గాక! ప్రేమనీతిజ్ఞానం లేనిజ్ఞానం వ్యర్థమైనదే, అది ఎందుకూ పనికిరాదు. ప్రేమనీతి భగవంతుని నీతి. అతనికి సర్వులూ తనవారే. సర్వులపై అతనికి ప్రేమ వుంది. ఆశ్రితవాత్సల్యం భగవంతుని నీతి. అది ప్రేమసంభరితమై వుంటుంది. దీనిని గ్రహించినట్టి భగవద్భక్తులు సర్వదా తదనుకూలంగానే సంచరిస్తూంటారు.

ఉద్ధవుడు బృహస్పతి నీతిలో ఆరితేరిన విద్వాంసుడని ఆదిలోనే చెప్పడం జరిగింది. యదువంశీయులలో ఏర్పడే అభిప్రాయభేదాలలో వారు అతని సలహాలు తీసుకునేవారు. కానీ అప్పుడు ఉద్ధవుడు భగవన్నీతి, ప్రేమనీతులలో విద్వాంసుడు కాడు. గోపికలవద్దకు వెళ్ళి అతడు ప్రేమ ధర్మోపదేశాలను పొందగలిగాడు. భగవన్నీతి విషయం అతనికి తెలుసును. అనేక సమయాలలో శ్రీకృష్ణుడు మనోగత విషయాలను తాను చెప్పక అతని చేత చెప్పించేవాడు.

ఆ రోజులలో ధర్మరాజు రాజసూయయాగం జరుగనున్నది. అక్కడ నుండి శ్రీకృష్ణునికి ద్వారకానగరానికి ఆహ్వానం వచ్చింది. మరోవైపు జరాసంధుని అత్యాచారాలచే పీడితులైనవారూ, అతనిచే బందీలుగచేయబడిన వేలాదిమంది రాజన్యులు, జరాసంధుని అంతంచేసి తమను రక్షించవలసినదిగా ప్రార్థనలు అందజేసుకున్నారు. దేవర్షినారదుడు వాసుదేవ సన్నిధికి వచ్చి "దేవా! శీఘ్రంగా నీవు శిశుపాలుని అంతంచెయ్యి. వాడి కారణంగా ప్రపంచంలో మహోత్పాతాలు జరుగుతున్నాయి. ఈ స్థితిలో అధికసంఖ్యాకులైన యాదవులూ బలరాముడూ కూడ జరాసంధ, శిశుపాలురు అంతం కావాలని స్వాభిప్రాయాలను వ్యక్తం చేశారు. అది తమ ప్రథమకర్తవ్యం" అన్నాడు.

శిశుపాల జరాసంధుల అత్యాచారాలకు సర్వులూ సహింపలేని వేదనను అనుభవిస్తూన్నారు. మనం అక్కడకు వెళ్ళక పోయినా ధర్మజుని

యాగం ఆగదు. అని వారన్నా శ్రీకృష్ణుని మనస్సులో పాండవులపై విశేషాకర్షణవుంది. ధర్మరాజార్జునద్రౌపదుల మనస్సు బాధపడరాదు. నా ఆనందంకోసమే వారు యాగం చేస్తున్నారు. నేనులేకుంటే వారు యాగం చేయలేకపోవచ్చును. శ్రీకృష్ణదేవుడు యీ విషయాలను స్వయంగా చెప్పక సర్వుల సమక్షంలో ప్రకటించ ఉద్ధవుని ప్రేరేపించాడు.

ఉద్ధవుడు "ముందుగా అత్యాచారాలను అంతంచేసి తరువాత యితర కార్యాలను చూసుకోవాలన్న మన వారిలో అధికసంఖ్యాకులూ బలరామదేవుడు కూడ స్వాభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ స్థితిలో నేనేమైనా చెబితే అది అప్రాసంగికంగావచ్చును. కానీ శ్రీకృష్ణదేవుని ప్రేరణగా నేను మాట్లాడుతున్నాను. వాసుదేవుని అభిమతాన్ని నేను నా అభిప్రాయానుసారం చెప్పడంలో మీకెట్టి ఆటంకం లేదుకదా. నీతులు అనంతంగానే వున్నా వాటివర్ణనలో కూడ అభిన్నరూపాలున్నాయి. కానీ అధికాంశవిషయసారాన్ని అల్పశబ్దాలలో వ్యక్తం చేయవచ్చును. కావున విస్తారంగాకాకుండ, నేను అల్పంగానే భాషిస్తాను. ధీశాలురు అల్పవిషయాలను కూడ విస్తరించుకోగలుగుతారు. కానీ నాలో అత్యధిక వర్ణనచేసి చెప్పే శక్తిలేదు."

శత్రువులను జయించి మిత్రులను వర్ధిల్లజేసుకోవాలనుకునే వారు ప్రజ్ఞ, ఉత్సాహాలనే రెండువిషయాలను ఆశ్రయించాలి. ప్రజ్ఞ అంటే శుద్ధమైన బుద్ధి అది అంతర్ముఖమై ఉంటుంది. విశ్వకళ్యాణార్థం సర్వస్వాన్నీ త్యజించగలగడమే. అట్టివారు చేసేపని కూడ స్వశక్తిని గుర్తించి దానిని సముచితరీతిని ఉపయోగించుకోవాలన్న యిచ్ఛ కలిగివుండడమే. ఉత్సాహశబ్దార్థము. ఈరెండూ లభించినవాడు వ్యవహారంలో యీషణ్మాత్రలోపం ఉండదు. సూక్ష్మబుద్ధికలవారు బాహ్యంగా అల్పంగా స్పృశిస్తారు. కానీ ఆంతరంగికంగా అయితే గంభీరాలను సందర్శించ గలుగుతారు. స్థూలమైన బుద్ధికలవారు మట్టీ కుప్పవోలె బాహ్యాన్నే స్పృశిస్తారు. కాని అంతరాంతరాలను స్పృశించజాలరు. భగవంతుణ్ణీ ఆశ్రయించనివారు అల్పకార్యాలను ఆరంభించి వాటిని పరిపూర్ణంచేయడంలో కూడ వ్యగ్రులై పోతూంటారు. శుద్ధమైన బుద్ధినీ,

భగవదాశ్రయాన్ని పొందినవారు మాత్రం విశేషకార్యాలు సాధించికూడ నిరాకులంగానే వుండిపోతారు.

శుద్ధమైన బుద్ధీ ఉత్సాహం వున్నా కూడ ప్రమాదాన్ని దరిచేరనీయరాదు. ప్రమాదం కారణంగా సమక్షానికి వచ్చిన వస్తువుకూడ దూరంగా పోతుంది. తద్భిన్నంగా సావధానుడై మానవుడు వుండగలిగితే సమక్షం నుండీ వేగంగా పారిపోయే వస్తువు కూడ హస్తగతమవుతుంది. బలప్రయోగాన్ని ఎప్పుడు చెయ్యాలో, ఎప్పుడు క్షమించాలో తెలుసుకోవాలి. మనపై ఎవరైనా అత్యాచారం చేస్తే తొందరపడి వారిని ఎదుర్కోరాదు. స్వశక్తి సామర్థ్యాదులను గురించి విచారించి, మిత్రులను, సహాయకులనూ సమీకరించుకోవాలి. అత్యాచారులు నాశనమయ్యే సమయం కూడా వచ్చి తీరుతుంది. అదృష్టాన్ని ఆశ్రయించియే ఉండిపొమ్మని నేననడం లేదు. అని చెప్పి పౌరుషాన్ని ఆశ్రయించి అగ్నిలో దూకమనీ సలహాయివ్వడం లేదు.

మీ శక్తిని గురించి యోచించుకోండి. పరులశక్తిని పరిశీలించండి ఒక్కసారి సావధానంగా యోచించండి. మీరు భగవంతునికి ఎంత దగ్గరగా ఉన్నదీ, ఎంతదూరంగా ఉన్నదీ గ్రహించండి. సామ, దాన, బేధ దండోపాయాలను కూడ ప్రయోగించ ప్రయత్నించాలి. భగవంతునిపై విశ్వాసముంచాలి. మీరు సంసిద్ధులై, మీ భావాలకు అనుకూలంగా మీకు సహకరించునట్టి మిత్రులను కూడ ఆహ్వానించండి. తద్వారా మీకు విశేషప్రోత్సాహం లభిస్తుంది. అనాయాసంగానే మీ ఉద్దేశ్యం నెరవేరుతుంది. ఎవరితో ఎప్పుడు సంధి చేసుకోవాలి? ఎప్పుడు కామక్రోధాదిశత్రువులను నాశనం చెయ్యాలి అన్న విషయమై యోచించాలి. అంతేకాదు ఎప్పుడెప్పుడు శత్రువుల ఒక్కొక్కఅంగాన్నీ క్రమక్రమంగా క్షీణింపజేయ్యాలో నిశ్చయించుకోవాలి.

"శ్రీకృష్ణ భగవానుడు ఆశ్రితవత్సలుడు. భక్తులముందు అతడెవరినీ దృష్టిలో వుంచుకోడు. ధర్మజుని రాజసూయాధ్వరానికి వాసుదేవుడు వెళ్ళితీరాలి. అక్కడకు పోకుండ శిశుపాల జరాసంధులను అంతంచేస్తే

తీవ్రపరిణామం ఏర్పడుతుంది. మీరు జ్ఞాపకముంచుకోండి. జరాసంధ, శిశుపాలురను అంతం చేయడంతో చాలదు. రాజయక్ష్మరోగ సమూహంవలె ఆదుష్టరాక్షసులిద్దరే కాక దుష్టరాజ సమూహం కూడ వుంది. వారితో వ్యతిరేక పరిస్థితి ఎదురు నిలిస్తే వారిని అంతం చేయడం కష్టతర మౌతుంది. పైగా మనకు పాండవుల సహాయం కూడ లభించకపోవచ్చును. ధర్మజుని యాగానికి కూడ విఘ్నాలు కలుగ వచ్చును. పైగా కృష్ణుడు రాకపోతే అతడు యాగంచెయ్యడు కూడాను. మనలను గురించి అతడే మనుకుంటాడో యోచించారా? జరాసంధ, శిశుపాలురలో ఏ ఒక్కరూ మనపై దండెత్తలేరుకదా, అట్టిదశలో మనమిత్రులూ, బంధువులూ అయినవారి ఉత్సవాలలో పాల్గొనక పరులపై దండెత్తడం నాకు నీతి సంగతంగా గోచరించడం లేదు.

"పైగా ప్రశ్నయిదియే కాదు కదా, శిశుపాలుని విషయం తరువాత చూద్దాము. జరాసంధుని బంధనంలో వున్న రాజన్యుల ప్రార్థనలను ఉపేక్షించరాదు. దీనుల శరణాగతులను రక్షించడం సర్వుల ఏకమాత్ర కర్తవ్యమై ఉంది. వాసుదేవుడు యిందులకై దీక్షా కంకణం ధరించి వున్నాడు. యాగానికి, శిశుపాల వధకు ముందే ఆ రాజులను విడిపించాలి. పైగా ఆ పని మనద్వారా జరుగరాదు. దీనికి సామూహికయుద్ధమూ పనికి రాదు. పాండవులను కలిసి వారి సహకారాన్నిపొంది యీకార్యాన్ని ఉపాయంద్వారా సాధించాలి. హస్తినాపురంచేరిన శ్రీకృష్ణుడు యీ పనినిచేస్తాడు. యాగానికి ముందుగానే రాజులను విడిపిస్తే మన ధర్మరాజుయొక్క శక్తి వర్ధిల్లుతుంది. ఆపై శిశుపాలుని రాజసూయయాగానికి ఆహ్వానించాలి. వాని వైఖరినీ రాజులసమ్మతినీ గ్రహించి శిశుపాలుని దోషాలు ప్రకటింపబడిన తరువాత అవకాశాన్ని పురస్కరించుకుని శిశుపాలుని సంగతి తేల్చవచ్చును. చిట్టచివరిసారిగా నా అభిప్రాయం శ్రీకృష్ణసమేతంగా మనమందరం పాండవుల యాగానికి వెడితే యేర్పాట్లన్నీ అక్కడ సక్రమంగా కొనసాగుతాయి.

ఉపర్యుక్త రీతిని ఉద్ధవుడు భాషించగా సర్వులూ ఏకగ్రీవంగా అతని అభిప్రాయాలను అంగీకరించారు. అప్పుడు బలరాముడందుకుని ఉద్ధవుని

అభిప్రాయాలు సక్రమంగా వున్నాయి. వాసుదేవుని అంతర్యాన్ని సమగ్రంగా ఎరిగిన ఇతడు అతని యిచ్ఛానుసారమే మాట్లాడుతారు. భగవంతుడు భక్తులనువిడనాడి భక్తిహీనుల దగ్గరకు వెళ్ళడు కనుక యిదియే సరియైనది, అన్నాడు.

సర్వులూ ధర్మజుని రాజసూయయాగ సందర్శనార్థం బయలుదేరారు. వాసుదేవుడు భీమునిద్వారా జరాసంధుని అంతం చేయించాడు. వేలాది మంది రాజన్యులు కారాగార విముక్తులై ధర్మరాజుకు సహకరించి యాగాన్ని విజయం చేశారు. శతాపరాధాల పర్యంతం మౌనంవహించిన మీదట శ్రీకృష్ణ భగవానుడు సర్వులూ చూస్తూండగా చక్రాన్ని ప్రయోగించి శిశుపాలుని ఉద్ధరించాడు. తద్వారా ధర్మజుని యాగం సకుశలంగా శ్రీసంపన్నముగా పూర్తయింది. ఉద్ధవుని నీతి విషయాలు దశదిశలావ్యాపించాయి. మహాభారతంలో అనేకస్థానాలలో ఉద్ధవునినీతి ప్రశంసించబడింది. ధృతరాష్ట్రుడు విదురుని ప్రశంసిస్తూ యాదవులలో నీతి శాస్త్రవిశారదుడైన ఉద్ధవునివలె కురుకులంలో నీవున్నావు. భగవత్కృప, సాన్నిధ్యం, ప్రేమపొందినవాడు నీతిమంతుడు కావడంలో సందేహమేముంటుంది? భగవదాదేశానుసారం ఉద్ధవుడు ద్వారకానగరంలో వసించసాగాడు.

శ్రీకృష్ణ భగవానుడు ప్రేమ స్వరూపుడైనట్లే, జ్ఞానస్వరూపుడు కూడ. యదార్థానికి ప్రేమ, జ్ఞాన భేదం అజ్ఞానులలో మాత్రమేవుంది. ప్రేమికి తెలియకుండ ఎంతటి అజ్ఞాత రహస్యమూ వుండదు. రహస్య జ్ఞాత ప్రేమించకుండ వుండలేడు. ప్రేమ విరోధి అయిన జ్ఞానం ఏకాంగియే అవుతుంది. భగవంతుడు పూర్ణుడు కాగా జ్ఞానప్రేమలు రెండూ అతని స్వరూపాలే. సాధన భక్తి కలిగి ప్రేమలక్షణ భక్తి అనుభవించిన వారికి శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా పరాభక్తిని పరమజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఉద్ధవునికి అట్టి పరమజ్ఞానాన్ని ప్రసాదించే పరిస్థితి వచ్చింది.

శంకరబ్రహ్మేంద్రాదులు వాసుదేవ సన్నిధికి వచ్చి "దేవా! మా ప్రార్థన నెరవేరింది. తమరు స్వధామానికి విజయం చేయవచ్చును

అన్నారు. యదుకులం ఉపసంహరింపబడడానికి ఏర్పాట్లు జరిగాయి. భగవానుడు స్వధామానికి విజయం చేసే సమయం ఆసన్నమయింది. ఆయన మనసా యోచించ సాగాడు, నేను యీ లోకాన్నుండి అంతర్ధానమై పోతే నాలోని జ్ఞానం ఎక్కడుంటుంది. ఇందుకు శుద్ధాంతఃకరణ కలవారిలో ఉద్ధవుడే శ్రేష్ఠుడు. నాకంటె ఉద్ధవుడెంత మాత్రం తక్కువవాడు కాడు. కారణం? అతడు ఎన్నడూ గుణప్రభావితుడు కాలేదు. సమర్థుడైన అతడు ప్రపంచంలో నాజ్ఞానాన్ని ప్రచారం చేస్తూయిక్కడే వుంటాడు. * వాసుదేవుడు సంకల్పించడమే తడవు అతని మనస్సులో యీ సంకల్పం కలిగిందోలేదో ఉద్ధవుడు వచ్చి శ్రీకృష్ణదేవుని శ్రీచరణాలకు ప్రణమిల్లాడు.

ఉద్ధవుడు పలికాడు "వాసుదేవా! ఇప్పుడు నువ్వీలోకాన్ని విడనాడాలనుకుంటున్నావు. ప్రభూ! క్షణకాలం కూడ నేను నీచరణకమలాలను పరిత్యజించజాలను. నీతో నన్నుకూడ నీధామానికి తీసుకువెళ్ళు. కృష్ణా మంగళమయమై మధుమయమైన నీ చరిత్రను ఆలకించిన వారికి అన్యవస్తువుల యందు యిచ్ఛయే వుండదు. బాల్యం నుండీ నేను నీతోనే వుంటూ వచ్చిన వాణ్ణి. లేస్తూ కూర్చుంటూ, నడుస్తూ, తిరుగుతూ, స్నానపానవేళల్లో సర్వదా నేనునీతో చరించాను. నీ ప్రసాదాన్ని సేవిస్తూనే నేను జీవితాన్ని గడపినవాణ్ణి. నా సుహృదుడవు, ఆత్మవూనీవే, నేను నిన్నెలా విడువగలను. మహామహాఋషులూ, మునులూ, నీ బ్రహ్మధామానికి పోగలరు. నేను కర్మపంకంలోపడి కొట్టుకుంటూన్నాను. నీలీలాస్మృతియే నాకు ఏకమాత్రాధారమై ఉంది. నేను నీ చరిత్రనూ వాణినీ స్మరించుకుంటూ, కీర్తించుకుంటూ ఉంటాను. లలితమైన నీగతీ, మందహాసము, సుందరమనోహరరూపమూ వినోదభరితమైన క్రీడలనూ

శ్లో. అస్మాల్లోకాదుపరతే మయి జ్ఞానం మదాశ్రయమ్ ।
అర్హత్యుద్ధవ ఏవాద్ధా సంప్రత్యాత్మవతాం వరః ॥

నోద్ధవోఽణ్వపి మన్న్యూనో యద్గుణైర్నార్దితః ప్రభుః ।
అతో మద్వయునం లోకం గ్రాహయన్నిహ తిష్ఠతు. ॥
(భాగవతం స్కంధం 3/4/30–31)

స్మరించుకుంటూ మత్తుడనవుతాను. నాకు మరియే ఆశ్రయమూ లేదు. నీవు నాపై దయచూపుము.

తన ఆంతరంగిక ప్రేమికుడైన ఉద్ధవుని పలుకులాలకించి శ్రీకృష్ణ భగవానుడన్నాడు. "ఉద్ధవా! నీవచనాలు పరమసత్యాలు. త్వరలోనే యీ ద్వారక సాగరగర్భంలో మునిగిపోతుంది. ప్రపంచంలో అధార్మికులు వర్ధిల్లుతారు. ఇకనువ్వు అందరిస్నేహాన్నీ విడనాడుము. నిజ జ్ఞానస్వరూపంలో స్థితుడవై శాంతినిపొందుము. కేవలం నాయందే మనస్సును లగ్నంచేసి సమదృష్టి సంపన్నుడవై పృథ్విపై సంచరించుము. ఉద్ధవా! ప్రాకృతమైన మనసేంద్రియాల ద్వారా గృహీతమగునట్టి వస్తువులన్నీ వినాశకరమై, మనోమయమై, మాయామయమైనవే, విశుద్ధాంతః కరణలేని వానికి నానావస్తువులూ గోచరమవుతాయి. అతడే 'ఇది గుణము ఇది దోషము' అని ఆలోచించుకుంటాడు. అట్టివాడు కర్మ, అకర్మ వికర్మ అన్నచక్రంలో పడిపోతాడు. కనుక ఏకాగ్రచిత్తంతో యీ జగత్తును ఆత్మలో దర్శించు. ఆత్మను నాలో దర్శించు. ప్రకృతి కానీ, ప్రాకృత వికారోత్పన్న విఘ్నాలేవీ నిన్ను ప్రభావితం చెయ్యజాలవు. నిన్ను స్పృశించజాలవు. నీలో నువ్వు సంతుష్టుడవుకమ్ము. గుణ దోషాలు రెండికీ అతీతుడవుకమ్ము. సర్వత్రా నన్నే దర్శించుము. క్షణకాలం కూడ దానినుండి చ్యుతుడవుకాకుము.

శ్రీకృష్ణుని ఉపదేశవాక్యాలు ఆలకించి ఉద్ధవుడు అనేక ప్రశ్నలు వేశాడు. అన్నిటికీ వాసుదేవుడు సవిస్తరంగా సమాధానం యిచ్చాడు. భాగవతంలోని ఏకాదశ స్కంధంలో అధికాంశ భాగం ఉపదేశాలతో నిండివుంది. చిన్నపుస్తకంలో తద్విషయమై సంపూర్ణంగా చర్చించడం అసంభవము. సంక్షేపంగా భగవద్వచనాలు కొన్ని మాత్రమే యిక్కడ పొందుపరచగలుగుతున్నాము.

భగవంతుడిలా పలికాడు– "నీకు నువ్వే మేలును కలిగించుకోవాలి. కళ్యాణ మార్గంలో అన్యులు అల్పంగానే సహకరించ గలుగుతారు. నాకు సర్వజీవులూ ప్రియమైనవే, అయినా మానవులు అత్యధికప్రియులు తనకు

తానుగా అనుసంధానం చేసుకోగలవాడు నన్ను పొందగలుగుతాడు. కావాలనుకుంటే ప్రతివస్తువు సహకారాన్ని పొందగలుగుతావు. పృథ్వినీకు క్షమను ఉపదేశిస్తుంది. ఆకాశం అసంగత్వాన్ని నేర్పుతుంది. సూర్యుడు సమదృష్టిని గురించి బోధిస్తాడు. పశుపక్ష్యాదుల నుండియే కాదు. చివరకు తృణాలనుండి కూడ ఉపదేశాన్ని గ్రహించవచ్చును. దత్తాత్రేయుడు ఇరువదినాలుగు మందిగురువులద్వారా ఉపదేశాన్ని పొందగలిగాడు.

విశ్వంలోని వస్తువులన్నీ వినాశంవైపు పరుగుతీస్తున్నాయి. ఈ రాజభవనం, యీ స్వర్ణముద్రలూ, యీ గజాశ్వాలూ ఎందుకూ పనికిరావు. వీటివైపుదృష్టిని పోనీయకు. అంతర్ముఖుడవై కేవలం నన్నే పొందుము. కేవలం నన్నే పొందుము, నువ్వు స్థూల, సూక్ష్మ కారణ శరీరాతీతుడవు. ఈ శరీరాలనే ఆత్మ అనుకోవడం వల్ల ఆవాగమన చక్రంలో పడి తిరుగవలసివస్తున్నది. వీటన్నింటినీ విడనాడుము. స్వర్గాన్ని సయితం లెక్క పెట్టకు. బ్రహ్మలోకాన్ని కూడ వాంఛించకు. అతని ఆయుర్దాయం కూడ అల్పమైనదే. అతడు కర్మపరతంత్రుడు. నిత్యముక్తుడవై నిత్య స్వతంత్రుడవైన ఆత్మవునీవు."

"బద్ధుడూ, ముక్తుడూ" అన్నవి గుణదృష్ట్యా గోచరమవుతాయే కానీ యథార్థానికి లేవు. ఈ గుణాలు మాయామూలకాలు. కనుకనే నాలో బంధనముక్తులన్నవి లేవు. స్వప్నంలో బద్ధుడైనవాడు ముక్తికోసం ప్రయత్నించేవరకూ అతడు ముక్తుడుకాడు. స్వప్నభంగం కావడంతో యదార్థం వెలుగులోకి వస్తుంది. అట్లే మాయలోచిక్కుకున్న వాని దశకూడ అంతే, జ్ఞానంతో ఈ అజ్ఞానబంధాన్ని ఖండించు. ప్రాణేంద్రియ మనోబుద్ధులకు సంబంధించిన. సంకల్పాలు చెయ్యకు. ఎవరినీ స్తుతించకు. ఎవరినీ నిందించకు. నిన్నెవరైనా స్తుతించినా, నిందించినా సమభావంతో ఉండు.

అత్యధికంగా విద్యలభించినా భగవత్తత్త్వ జ్ఞానం లభించకపోతే అది ఎందుకూ పనికిరాదు. నా పవిత్ర లీలా గుణవర్ణనలు కల విద్యయే సత్యమైన విద్య. ఆత్మను గ్రహించడంలోనే విద్యాబుద్ధుల ప్రయోజనం

వుంది. ఆత్మజ్ఞాన వాస్తవరూపంవల్ల నానాత్వభ్రాంతి దూరమవుతుంది. దానియందే మనస్సు సమర్పించుము. బుద్ధిని నాయందు లగ్నంచెయ్యి. నువ్వు నావాడవు. నాయందే ఉంటావు. అలా నువ్వు స్వయంగా చెయ్య జాలకపోతే సత్సంగం చెయ్యి. సాధుమహాత్ములు చెప్పిన ప్రకారం నాస్వరూపాన్ని ధ్యానించు. చింతించు సాకార, నిరాకార, విష్ణు, రామ రూపాలన్నీ నావే. వీటిలో దేనిని ధ్యానించినా శాంతి, దాంతి, తితిక్షాది గుణాలను పొందగలవు. నా గాథలనూ ఆలకించుము. నావ్రతాలను చెయ్యి. నాకై నియమాలను పాలించుము. ఏమి చేసినా నాకే అర్పించుము.

"నన్ను సుగమంగా పొందడానికి సత్సంగమే సాధన, యోగ, సాంఖ్య, ధర్మాదులు కఠినమైనవి. సత్సంగాన్ని సర్వులూ చేయుగలరు. శూద్రులు, స్త్రీలు, అంత్యజులు. అనేకమంది దైత్యులూ, దానవులు పశుపక్ష్యాదులూ కూడ సత్సంగంద్వారానే నన్ను పొందగలిగారు. సత్సంగంద్వారా నాయందు మనస్సును లగ్నంచేయుము. ఉద్ధవా! నీకు గోపికలు గుర్తున్నారు కదా ఎంత తన్మయత్వంతో వారు నాచింతన చేస్తూన్నారు. నువ్వు విధి విధానాలను ఆశ్రయించడం విడనాడు. ప్రవృత్తి, నివృత్తి, శ్రుత, శ్రోతవ్యాలకు దూరుడవైపో, రా! కేవలం నాశరణులోకిరా, నీకు నిర్భయస్థానం లభిస్తుంది.

గుణాలతో ఏర్పడ్డచిత్తం గుణాలను ఎలా విడనాడగలుగుతుంది. అని ఆలోచించకు. చిత్తంనుండి గుణాలు దూరమవగలవు. చిత్త, గుణాలు రెండూ అన్యోన్యాశ్రితాలు. కానీ నారూపం ఆరెంటికన్న అతీతమైనది. నన్ను గ్రహించ గలవాని చిత్తగుణాలు రెండూ విముక్తమైపోతాయి. వాటితో ఏకమవడం వల్లనే యీబంధం ఏర్పడుతుంది. ఆత్మదృష్ట్యావాటికి సత్తాలేదు. జాగ్రద, స్వప్న, సుషుప్తులు – యీ అవస్థలు మూడూ మనస్సంబంధమైనవి. వీటిని తిలకించేది ఆత్మయే, నామాయవల్లనే యివి నాలోనే నిర్మితమైయున్నాయి అని భావించి జ్ఞానకరవాలంతో వీటిని ఖండించు. కేవలం నన్నేభజించు. ఇవన్నీఏకమైనవి. కేవలం ఆత్మమాత్రమే శాశ్వతమైనది. ఆత్మాతిరిక్తంగా గోచరించే వన్నీ మాయయే. వాటినుండి దృష్టిని మరల్చి తన్మయుడవైపో."

తన్మయుడవైన మీదట స్వరూపస్థితి ఏర్పడడంతో వినాశకరమైన శరీరదర్శనం కాదు. ఇది వున్నాలేకున్నా మనుజుని దృష్టి అటుపోనే పోదు. ప్రారబ్ధం వున్నంతవరకూ శరీరం సజీవంగా ఉంటుంది. ప్రారబ్ధం క్షీణించడంతో యీశరీరం పడిపోతుంది. తత్త్వజ్ఞానులైన మహాత్ములు ప్రపంచ, ప్రారబ్ధశరీరాలపై దృష్టిని ఉంచరు. అదృష్టియే వారి దృష్టి ఇదియే పరమతత్త్వము. ఇందులో స్థితుడై ఉండి సాధనలన్నింటి పూర్ణత్వంగా గ్రహించుము.

"ఈ జీవనలక్ష్యం ఏమిటి?" అన్న విషయమై అనేకులు స్వాభిప్రాయాలను వ్యక్తం చేశారు. కానీ స్వేచ్ఛగా వ్యక్తం చేసే విషయానికి విలువవుండదు. వారిదృష్టి సాంసారిక విషయాలపై లగ్నమై ఉండడం జరుగుతుంది. వారు వాటిని పొందగలుగుతున్నారు కూడ. ఒక్కొక్కప్పుడు ఆలక్ష్యం నుండి పతనమైపోతూంటారు కూడ. సర్వాన్నీ ఉపేక్షించినాకై ఆత్మసమర్పణ చేయగలిగినట్టి వారుమాత్రం మత్స్వరూపులే అవుతారు. అట్టివారికి లభించే సుఖశాంతులు అన్యులకు ఎలా లభిస్తాయి? నా భక్తులను నేను ప్రేమించునంతగా పరులవిషయం అలా వుంచగా నన్ను నేను ప్రేమించుకోను. నన్నుకోరేవారు మోక్షాన్ని కూడ అభిలషించరు.

నాభక్తుల సమక్షంలో విషయప్రలోభం రావచ్చును. పామరులు విషయవశీభూతులైనట్లు నా భక్తులు కాజాలరు. వారికి నాఆశ్రయంవుంది. నేను అన్ని విఘ్నములను నాశనంచేసి వేస్తాను. సాధనలన్నింటిలోనూ నా భక్తియే సర్వశ్రేష్ఠమైన సాధన, భక్తిద్వారామాత్రమే నేనులభిస్తాను. నీచాతినీచాలను సయితం నాభక్తి పవిత్రులను చేస్తుంది. నా భక్తిలేనివారు ఎంతగా ధర్మాచరణ చేసినా యదార్థమైన పవిత్రత వారికి లభించదు. నా లీలల నాలకించినా రోమాంచం పొందనివారూ, ద్రవించని చిత్తాలు కలవారూ, కనులనుండి అశ్రువులను రాల్చని వారూ, ప్రేమతో గద్గదత్వం పొందని వారూ, విశుద్ధాంతఃకరణులు కాజాలరు. నా ప్రేమలో ఉన్మత్తులై సంకోచరహితంగా ఆడుతూ, పాడుతూండేవారు, యావద్విశ్వాన్నీ పవిత్రం చేస్తారు. వారిబుద్ధి శుద్ధమవుతుంది. విషయధ్యానమగ్నులు నాశనమై పోతారు. నన్నుధ్యానించునట్టివారు నన్నే పొందగలుగుతారు. కనుక

విషయాలనూ, విషయవాసనాతత్పరుల సాంగత్యాన్నీ శీఘ్రంగా విడిచిపెట్టు. నీచిత్తాన్ని నాపై లగ్నంచెయ్యి. నీకు శుభమంగళపరంపరలే చేకూరుతాయి.

"ఆసనంవెయ్యి, ప్రాణాయామంచెయ్యి, ప్రణవాన్ని జపించు. శ్వాసతోబాటు నానామాన్ని జపించు. నా మూర్తులలో దేనినైనా ధ్యానించు. ఎన్నో సిద్ధులు ప్రాప్తించవచ్చును. కానీ అవిమాత్రం వాంఛనీయం కావు. వాటివైపు కనులెత్తి కూడ చూడకు. ఈ విశాలవిశ్వంలో నన్నే చూడు. ఉద్ధవా! నా విభూతులు గణనాతీతంగావున్నాయి. యత్నిస్తే ఎక్కడైనా నువ్వు నన్ను చూడగలుగుతావు."

బ్రహ్మచారివైతే బ్రహ్మచర్యవ్రతాన్ని పాలించు. గృహస్థ, వానప్రస్థం, సన్న్యాసులలో ఎవరివైతే స్వశాస్త్రోక్తధర్మాలను ఆచరించు. శాస్త్రం అంటే నా ఆదేశమే. శాస్త్రాజ్ఞలను పాలించడమంటే నా ఆదేశాలను పాలించడమే అవుతుంది. తదాచరణ సమయంలో సయితం నన్నుమరువకు. నా స్మరణమే వాటికి ప్రాణము.

ఉద్ధవా! ఈ మానవ శరీరం అత్యంత దుర్లభమయింది. నీకు సులభంగా లభించింది. సంసారసాగర తరణానికి యిది నౌకలా ఘనిచేస్తుంది. గురువు దీనికి కర్ణధారుడైవున్నాడు. అనుకూలవాయువుగా నేనుంటాను. ఇట్టి దశలో అంటే యీ మహావకాశం లభించినా అపారసంసార సాగరాన్ని దాటగోరని వాడు తెలిసివుండియే ఆత్మహత్యచేసుకుంటూన్నాడన్నమాట అనుక్షణం ఆయుర్దాయం తరిగిపోతూన్నది. ప్రతిక్షణం మృత్యువు సన్నిహిత మవుతూన్నది. సావధానుడవుకావాలి. ఈశరీరం వుండగానే సంపూర్ణ లాభాన్ని అందుకో. స్వకర్తవ్యాన్ని పాలిస్తూ దుష్కర్మలను త్యజించు. ఆదిలో మానసిక దోషత్యాగవిషయంలో అసమర్థుడవైతే భయపడకు. శారీరక పాపవిముక్తుడవై నన్ను భజించుము. భజన ద్వారా హృదయగత కామనలన్నీ నాశనమై పోతాయి. హృదయగ్రంధి విడిపోతుంది. సంశయాలన్నీ నాశనమైపోతాయి నువ్వు కర్మాతీతుడవు కాగలుగుతావు.

కర్మ, తపస్సు, జ్ఞానవైరాగ్యాలు యోగదానాది సర్వోపాయాలద్వారా లభించే ఫలం కేవలం నాభక్తి మాత్రంచే పొందగలుగుతావు. ఫలాన్ని అపేక్షించకు. నాభక్తులు నిరపేక్షగానే వుంటారు. వారు మోక్షాన్నికూడ అపేక్షించరు. నిరపేక్షత్వమే పరమకళ్యాణ ప్రదమైనది. అదియే నాయందలి యదార్థమైన భక్తి కూడ.

ప్రపంచంలో ఎవరూ ఎవరికీ సుఖదుఃఖాలలో దేనినీయీయరు. సర్వులూ తమతమ కర్మలననుసరించియే ప్రకృతిప్రవాహంలో పడికొట్టుకుపోతూంటారు. ఎవరినీ సుఖనిమిత్తాలనుభవించి అంటిపెట్టుకొని ఉండకు. అశాస్త్రీయములై ఆలస్యమువల్ల జరుగునట్టివైన కర్మలు తామసికాలవుతాయి. ఆసక్తితో చేసే కర్మలు రాజసికాలవుతాయి. బుద్ధ్యాలోచించి చేయబడునట్టివి సాత్త్వికకర్మలనబడతాయి. నన్నాశ్రయించి జరుగునట్టి కర్మలు నిర్గుణాలనబడతాయి. విషయభోగాలవల్ల కామనలు తృప్తిచెందవు. దీనికి ఒకటికాదు అనేకమైన ఉదాహరణలున్నాయి. సామాన్యులు ఆదిగా పత్రమాట్లు వరకూ కోరికలనే అగ్నిలో దగ్ధమవుతున్నారు. నువ్వు పురూరవచక్రవర్తిగాథను విన్నావు కదా, కోర్కెలను పరిత్యజించు ఆత్మలో పరమాత్మలో స్థితుడవుకమ్ము!.

సర్వమూ ఆత్మే. సర్వమూ పరమాత్మయే. అన్యులపై దృష్టిని పోనీయకుము. నాలీలలనే దర్శించుము. ప్రపంచమెందుకు? ఎవరి కోసము? అని శంకించకుము. కామనలే ప్రపంచము. వాటి సంస్మరణయే వాటి ఆవాగమనము. మహాత్ముల నిశ్చితాభిప్రాయ మిదియే. యదార్థానికి ఇదియే నాజ్ఞానము. "కేవలం నేనే" నేనేవున్నాను. ఆదిలోలేని ప్రపంచం అంతంలోనూ వుండదు. మధ్యఎక్కడనుండి వచ్చింది కేవలం ఆత్మతత్త్వంలో అన్యాన్ని కల్పించుకోవడమంటే మోహం కాక మరేమిటి? ప్రియమైన ఉద్ధవా! నువ్వు దీనిని అధిగమించి లే. సర్వేసర్వత్రా నన్నే చూడు. సర్వత్రా భగవద్భావాన్ని కలిగి సంచరించు. సర్వాధికమైన బుద్ధి ఇదియే. సర్వార్థికమైన చతురత్వమిదియే. అసత్య ప్రపంచం ద్వారా సత్యపరమాత్మను పొందాలి. మృత్యుశీలమైన శరీరంతో అమృతత్వాన్ని అందుకో. నేను నీకు పరమజ్ఞానోపదేశం చేశాను. దీనిని

అర్థంచేసుకోగలవారి సందేహాలన్నీ దూరమై వారు నన్ను పొందగలుగుతారు.

ఉద్ధవుడు అంజలిబద్ధుడై గద్గదకంఠుడై నయనాలనుండి అశ్రువులు జలజలరాల శ్రీకృష్ణదేవుని శ్రీచరణాలపై వ్రాలి పోయాడు. ఏమీ మాట్లాడలేక పోతున్నాడు. చివరకు కొన్నిక్షణాలకు సావధానుడై "ప్రభూ! నామోహాంధకారం దూరమై పోయింది. నువ్వు జ్ఞానజ్యోతిని ప్రసాదించావు. నీకునాపై అపారమైన కృపవుంది. నేను నీచరణకమలాలను ఎలావిడువగలను. ఇప్పుడు నాస్నేహబంధం విచ్ఛిన్నమైపోయింది. నీ పాదారవిందాల యందు నాకుగల భక్తి దృఢమగునుగాక! నేను కోరేది యింత మాత్రమే".

బదులుగా భగవంతుడు పలికాడు "ఉద్ధవా! నువ్విక్కడ నుండి బదరీవనానికి వెళ్ళిపో. నా పాదోదకజలాలైన గంగలో స్నానంచేసి అలకనందా దర్శనమాత్రంచే పవిత్రుడవు కమ్ము. ప్రాకృతిక ద్వంద్వాలను సహిస్తూ అరణ్యంలోని ఫలపుష్పాలను ఆరగిస్తూ సర్వదా శాంతంగా ఇంద్రియాలను అదుపులో ఉంచుకుని జ్ఞానవిజ్ఞానాలకు ఎన్నడూ దూరుడవుకాకుండా వ్యవహరించు. నేనునీకు చెప్పిన విషయాలను ఏకాంతంతో అనుభవిస్తూండాలి. నీమనోవాక్కులను నాయందు లగ్నంచేసి నేను చెప్పిన ధర్మాలలో సంలగ్నుడవై సంచరించాలి."

ఉద్ధవునకు తనదన్న వ్యక్తిత్వమేదీ లేదు. అతడు భగవదాదేశానుసారం నడిచేయంత్రం వంటివాడు. పరమాత్మ అతణ్ణి ఉంచదలచినవాడు. అతడు వియోగదుఃఖాన్ని సహితం అనుభవిస్తూనే ఆనందంగా వుండగలడు. గోపికలనుండి అతడు నేర్చుకున్నది అదియే కదా. భగవంతుని విరహంలో ఎలాఉండాలన్నదే గోపికలనుండి అతడు సాధించిన విశేషసాధన. అతడు భగవంతునికి ప్రదక్షిణ చేశాడు. తనకన్నీటి ధారతో అతని చరణ కమలాలను ప్రక్షాళన చేశాడు. మాటిమాటికి ప్రణమిల్లి కృష్ణవిరహ వికల మానసుడై బదరికాశ్రమంవైపు పురోగమించాడు. సకాలంలో పరమాత్మ అంతర్ధానమై పోయాడు.

ఉద్ధవుడు యమునాతీరం చేరేసమయానికి ధర్మావతారుడైన విదుర మహాత్ముడు అతనికి దర్శనమిచ్చారు. విదురుడు, శ్రీకృష్ణయాదవాదుల కుశలసమాచారం అడిగాడు. అతని ప్రశ్నలనాలకిస్తూనే విదురుడు భగవత్స్మృతిలో తన్మయుడైపోయాడు. బాల్యాది ఏతత్ప్రభృతి ఉద్ధవుడు శ్రీకృష్ణునితోనే ఉన్నవాడు. అతడే నేడు వాసుదేవుని నిజధామగమనవార్త వినిపించాలంటే అతని కెంత కష్టమో యోచించాలి. చాలసేపటివరకూ అతడు శ్రీకృష్ణచింతనలో తన్మయుడై పోయాడు. మనసా అతనికి భగవద్దర్శనం కలిగింది. అతడు భగవల్లీలాలోకంలోకి వెళ్ళిపోయాడు. అతని శరీరం పులకరించింది. కనులనుండి అశ్రుధారలు ప్రవహించాయి. ప్రేమధార అతనిశరీరంనుండి పెల్లుబికింది. అతడు క్రమక్రమంగా స్వస్థితిని పొంది కనులుతుడుచుకొని చిరునవ్వుతో విదురునితో అన్నారు.

విదురా! ఇప్పుడు ద్వారకలో ఏమీలేదు. శ్రీకృష్ణుడే అంతర్థానమైపోతే నేను ఎవరి కుశలసమాచారం చెప్పగలను. ఈ ప్రపంచం మహాదురదృష్టవంతమైనది. యాదవులు భాగ్యహీనులనడంలో సందేహమేలేదు. వాసుదేవునితో వుంటూకూడ వారతణ్ణి గుర్తించలేదు. అతని కనుసన్నలను అనుసరించి సంచరించే వారూ, అతనితో ఆడిపాడి, తిని త్రాగినవారు. అతనిని యదువంశ శ్రేష్టునిగా మాత్రమే గుర్తించారు. భగవన్మాయయే యిట్టిది. పరమాత్మ ఎవరిని కరుణించదలచుకుంటాడో వారే భగవంతుని గుర్తించగలుగుతారు. పరమాత్మ అతృప్తనేత్రాలను తృప్తిపరచాడు. మరణాపన్నులకు జీవనదానం చేశాడు. అతని సన్నిధికి వచ్చిన వారందరికీ కళ్యాణ మార్గాన్ని తెరచివుంచాడు. అట్టివారిని ఉద్ధరించాడు.

పరమాత్ముని సాహచర్య, సన్నిహితాలలో
జీవనం సాగించిన ఉద్ధవుడు ధన్యుడు

భక్తునకు భగవంతునకు జయమగుగాక!

------oOo------